PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

పక్కా తెలుగు

5 DOTS NETWORK

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 018 | ఆదివారం | 12-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 018 | Sunday | 12-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



## 'హిట్, రన్, ఎస్కేప్' రాజకీయాలు

వివరాలు 2లో..




» జగన్‌పై సీఎం తీవ్ర విమర్శలు
» వైసీపీకి ప్రజాస్వామ్య లక్షణాలు లేవు
» ఆ పార్టీవి నేర రాజకీయాలు
» షాబాద్ ఘటనతో పోల్చిన చంద్రబాబు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ లక్షణాలు లేవని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విమర్శలు చేశారు. నేరపూరిత ఆలోచనలు, విధ్వంసక రాజకీయాలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించారని ఆరోపించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ పాలనలో పలువురు ఐఏఎస్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అనేక పరిశ్రమలు దెబ్బతిన్నాయని, ఇప్పుడు కూడా పెట్టుబడిదారులను భయపెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

## అమరావతి భూసేకరణ వివాదం

**• రైతుల పక్షాన పోరాటం చేస్తాం • ఉండవల్లి ఘటనపై జగన్ ఆగ్రహం**

అమరావతి రాజధాని పేరుతో ఉండవల్లిలో రైతులపై ప్రభుత్వం బలవంతపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. రైతులు తమ భూములు ఇవ్వబోమని స్పష్టంగా చెబుతున్నా, వారి అభిప్రాయాలను పట్టించుకోకుండా పోలీసులను మోహరించి బుల్డోజర్లతో పొలాల్లోకి వెళ్లి పంటలను ధ్వంసం చేశారని విమర్శించారు. రైతులను బలవంతంగా పొలాల నుంచి బయటకు పంపించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బాధితుల్లో అత్యధికులు సన్నకారు, చిన్నకారు రైతులేనని జగన్ పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ఆ కొద్దిపాటి భూమే జీవనాధారమని చెప్పారు. అదే భూమిలో పండే పంటతో కుటుంబాలను పోషించుకుంటున్నారని, పిల్లల చదువులు కొనసాగిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి రైతులు తమ భూమి తీసుకుంటే ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం సమాధానం



చెప్పకుండా పోలీసు బలంతో అణచివేస్తోందని ఆరోపించారు. ధ్వంసమైన పంటలకు పరిహారం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు.



## వార్నింగ్‌కే వార్నింగ్

### ట్రంప్ మాటలు పట్టించుకోం

**• ఒప్పందం ఉల్లంఘిస్తే ప్రతీకారం • కవ్విస్తే ఖతమైపోతారంటూ నిప్పులు • ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్**

అమెరికా తన హామీలను ఉల్లంఘిస్తే అదే స్థాయిలో ప్రతిస్పందిస్తామని ఇరాన్ మరోసారి కఠిన హెచ్చరిక జారీ చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "ఇరాన్‌తో ఒప్పందం ముగిసింది" అని ప్రకటించిన కొద్ది రోజులకే ఇరాన్ ఈ వ్యాఖ్యలు చేసింది. అమెరికాతో చర్చలు కొనసాగించాలని తాము కోరలేదని, ఖతార్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలను మాత్రమే అంగీకరించామని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికాపై తమకు ఎలాంటి విశ్వాసం లేదని కూడా పేర్కొంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ, అమెరికాతో యుద్ధం ఇరాన్ లొంగిపోవడంతో ముగిసేది కాదని, దేశ హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

**పశ్చిమసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు**

అమెరికాతో జరిగిన చర్చల సమయంలోనే తమకు అమెరికాపై నమ్మకం లేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు చెప్పినట్లు ఘాలిబాఫ్ వెల్లడించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయతుల్లా ఖొమేనీ మనవడు అలీ ఖొమేనీ కూడా అమెరికాతో చర్చలు శాంతి కోసం కాదని, అది మరో రూపంలోని పోరాటమేనని వ్యాఖ్యానించారు. గత నెల కుదిరిన ఒప్పందం తర్వాత కూడా ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగడంతో కాల్పుల విరమణ పరిస్థితి బలహీనంగా మారింది. ఇటీవల ఇరాన్‌లో పేలుళ్లు చోటుచేసుకోగా వాటిలో తమ ప్రమేయం లేదని అమెరికా ప్రకటించింది. ఇదే సమయంలో ట్రంప్ మరోసారి చర్చలకు సిద్ధమని సంకేతాలు ఇవ్వగా, మధ్యవర్తి దేశమైన ఖతార్ ప్రతినిధి బృందం టెహ్రాన్ చేరుకుని చర్చలు ప్రారంభించడం అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రాహ్మణి

### అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం


హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ప్రముఖ వ్యాపార పత్రిక ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్-2026' జాబితాలో ఆమె చోటు దక్కించుకున్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్న మహిళా పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా ఆమెను గుర్తించారు. ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో నారా బ్రాహ్మణికి ఈ పురస్కారాన్ని అందజేశారు.

**రైతులకే అంకితం**

ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ హెరిటేజ్ ఫుడ్స్ విజయానికి రైతులే ప్రధాన బలం అని అన్నారు. పాల ఉత్పత్తి రంగంలో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రైతుల జీవనోపాధిని మరింత మెరుగుపరచడమే తమ లక్ష్యమని వివరించారు. తనకు లభించిన ఈ గౌరవాన్ని హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

**చంద్రబాబు, లోకేశ్ అభినందనలు**

నారా బ్రాహ్మణి సాధించిన ఈ ఘనతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు ఆమె నాయకత్వం, దూరదృష్టి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. యువతకు, ముఖ్యంగా తెలుగు యువతులకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఫార్చ్యూన్ ఇండియా జాబితాలో స్థానం సంపాదించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని అన్నారు.



## ఇకపై ఏఐతో యుద్ధాలు

◆ విజయం మాత్రం సైనికులదే
◆ సాంకేతికత, సైనిక బలం అవసరం
◆ ఐఎన్ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం
◆ కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్

2లో..



భవిష్యత్తులో యుద్ధాలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ సహాయంతో జరిగినా, తుది విజయాన్ని సాధించేది శిక్షణ పొందిన సైనికులేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో భారత నౌకాదళ తూర్పు నౌకాదళంలో స్వదేశీ స్టెల్త్ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరిని అధికారికంగా ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రతలో ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ సైనిక శక్తి కూడా సమానంగా కీలకమని పేర్కొన్నారు.



## సాయికృష్ణ లాకప్ డెత్ కేసు

**సుప్రీంకోర్టుకు ఏపీ సర్కార్**

**హైకోర్టు షరతులపై అభ్యంతరం**

సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై హైకోర్టు విధించిన నిబంధనలను సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తరఫున పిటిషన్ దాఖలైంది. నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తిస్థాయి వీడియో రికార్డింగ్ తప్పనిసరి చేయడం దర్యాప్తు గోప్యతకు భంగం కలిగిస్తుందని ప్రభుత్వం వాదిస్తోంది. సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, ఘటన పునర్నిర్మాణం వంటి కీలక ప్రక్రియలకు హైకోర్టు విధించిన షరతులు అడ్డంకిగా మారుతున్నాయని సిట్ పిటిషన్‌లో పేర్కొంది. నిందితుడిని ఎలాంటి కఠిన నిబంధనలు లేకుండా కస్టడీలో విచారించేందుకు అనుమతించాలని సుప్రీంకోర్టును కోరింది. విజయవాడలో సంచలనం సృష్టించిన ఈ కస్టోడియల్ డెత్ కేసులో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సమర్థవంతమైన విచారణ అవసరమని అధికారులు భావిస్తున్నారు. సిట్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై వచ్చే వారం సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

## పవన్‌కు విజయవంతమైన ఆపరేషన్

◆ ముంబైలో శస్త్రచికిత్స సక్సెస్
◆ కోలుకోవాలని అభిమానుల ప్రార్థనలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ముంబైలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్థివాలా నేతృత్వంలోని వైద్య బృందం ఈ శస్త్రచికిత్స నిర్వహించింది. కుడి భుజానికి జరిగిన ఆపరేషన్ సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగిందని, అనంతరం పవన్ కళ్యాణ్‌ను రికవరీ గదికి తరలించినట్లు అధికారులు తెలిపారు. (వివరాలు 2లో..)





2లో..

## రాధా గాయత్రి మృతి కేసులో ట్విస్ట్

**నెల తర్వాత భర్త శ్రీ చరణ్ అరెస్ట్**

ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో హోమ్ స్టేలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన నవవధువు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఘటన జరిగిన దాదాపు నెల రోజుల తర్వాత మృతురాలి భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. 27 ఏళ్ల రాధా గాయత్రి జూన్ 15న ముస్సోరీ సమీపంలోని ఓ హోమ్ స్టేలో మృతిచెందింది. ఈ ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు, ఫిర్యాదు తర్వాత కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## అలల్లో కలిసిన కలలు

**వియత్నాంలో విషాద యాత్ర**

**భారతీయుల బలిగొన్న సముద్రం**

**బోటు బోల్తాపడడంతో పెను ప్రమాదం**

**ముగ్గురు ఏపీ వాసులు మృతి**

**అధికారులతో మాట్లాడిన నారా లోకేశ్**



3లో..



8లో..

## అస్తమించిన గాన కోకిల

**మూగబోయిన మధుర గానం**

**సంగీత ప్రపంచానికి దిక్సూచి**

## ధర్మ దర్శనం కష్టం దొరా..


**శ్రీవారే ఆలకించాలి భక్తుల మొర**

**వాడపల్లిలో భక్తుల గోస: వెంకన్న దర్శనం ఒక అగ్నిపరీక్ష!**

2లో..

# 'హిట్, రన్, ఎస్కేప్' రాజకీయాలు

- జగన్‌పై సీఎం తీవ్ర విమర్శలు
- వైసీపీకి ప్రజాస్వామ్య లక్షణాలు లేవు
- ఆ పార్టీవి నేర రాజకీయాలు
- షాబాద్ ఘటనతో పోల్చిన చంద్రబాబు



"హిట్ , రన్, ఎస్కేప్" రాజకీయాలే వారి నైజమని విమర్శించారు. రాష్ట్రంలో ఘటనలు జరిగేలా చేసి, తర్వాత దూరంగా ఉండే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ లక్షణాలు లేవని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విమర్శలు చేశారు. నేరపూరిత ఆలోచనలు, విధ్వంసక రాజకీయాలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించారని ఆరోపించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ పాలనలో పలువురు ఐఏఎస్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అనేక పరిశ్రమలు దెబ్బతిన్నాయని, ఇప్పుడు కూడా పెట్టుబడిదారులను భయపెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

**'హిట్, రన్, ఎస్కేప్' రాజకీయాలంటూ విమర్శ**

వైసీపీ అధినేతపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో జరిగిన షాబాద్ ఆరుగురు హత్యల ఘటనను ప్రస్తావించిన చంద్రబాబు, నేరపూరిత మనస్తత్వం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన చూపించిందన్నారు. పోక్సో కేసుపై కక్షతో అమాయకులను హత్య చేసిన నిందితుడి చర్యలను ప్రస్తావిస్తూ, సమాజంలో ఇలాంటి మనస్తత్వాలను అరికట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆధ్యాత్మిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానం కలిసొస్తే ప్రజలు నిజానిజాలను గుర్తించే సామర్థ్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న ఆరోపణ**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అమరావతి, పోలవరం, వెలిగొండ వంటి కీలక ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ఈ అభివృద్ధి కొందరికి ఇబ్బందిగా మారిందని, రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పెట్టుబడిదారుల్లో అనుమానాలు సృష్టించే ప్రచారాలు రాష్ట్రాభివృద్ధికి హానికరమని చెప్పారు. బ్రాహ్మణి స్టీల్స్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ఖనిజ సంపదకు భారీ నష్టం జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. ఓబుళాపురం మైనింగ్ వివాదం కారణంగా విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి దూరమయ్యాయని అన్నారు. ఆ ప్రాజెక్టు అడ్డంకులు లేకపోయి ఉంటే సిమెంట్ పరిశ్రమలు సహా అనేక పారిశ్రామిక సంస్థలు వచ్చేవని పేర్కొన్నారు. లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి**

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, వ్యక్తిత్వ హననం, మహిళలపై అసభ్యకర పోస్టులను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజల భద్రతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతికూల ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని చంద్రబాబు అన్నారు.



# పవన్‌కు విజయవంతమైన ఆపరేషన్

- ముంబైలో విజయవంతమైన శస్త్రచికిత్స
- కోలుకోవాలని అభిమానుల ప్రార్థనలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ముంబైలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్దివాలా నేతృత్వంలోని వైద్య బృందం ఈ శస్త్రచికిత్స నిర్వహించింది. కుడి భుజానికి జరిగిన ఆపరేషన్ సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగిందని, అనంతరం పవన్ కళ్యాణ్‌ను రికవరీ గదికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

## భుజం గాయాలు తీవ్రం కావడంతో నిర్ణయం

పవన్ కళ్యాణ్ రెండు భుజాల్లోనూ రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ కూడా గుర్తించడంతో వెంటనే శస్త్రచికిత్స అవసరమైందని వైద్యులు సూచించారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేస్తే కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని భావించి, ముందుగా కుడి భుజానికి మాత్రమే ఆపరేషన్ చేశారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత ఎడమ భుజానికి శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం కార్యాలయం వెల్లడించింది.

## విధులకే ప్రాధాన్యం ఇచ్చిన పవన్

2016లో ఏర్పడిన భుజం గాయాలు కాలక్రమేణా తీవ్రరూపం దాల్చినప్పటికీ, పవన్ కళ్యాణ్ ప్రజా కార్యక్రమాలు, రాజకీయ పర్యటనలు, అధికారిక బాధ్యతలను ఆపకుండా కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. వైద్యులు ముందుగానే శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించినా, ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలను పూర్తి చేసిన తర్వాతే ఆస్పత్రిలో చేరినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన అనస్థీషియా ప్రభావం నుంచి కోలుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

## పవన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు

పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు, జనసేన నాయకులు ప్రార్థనలు చేస్తున్నారు. తిరుపతిలోని అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ప్రజా సేవలోకి తిరిగి రావాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# అమరావతి భూసేకరణ వివాదం

- రైతుల పక్షాన పోరాటం చేస్తాం
- ఉండవల్లి ఘటనపై జగన్ ఆగ్రహం

అమరావతి రాజధాని పేరుతో ఉండవల్లిలో రైతులపై ప్రభుత్వం బలవంతపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. రైతులు తమ భూములు ఇవ్వబోమని స్పష్టంగా చెబుతున్నా, వారి అభిప్రాయాలను పట్టించుకోకుండా పోలీసులను మోహరించి బుల్డోజర్లతో పొలాల్లోకి వెళ్లి పంటలను ధ్వంసం చేశారని విమర్శించారు. రైతులను బలవంతంగా పొలాల నుంచి బయటకు పంపించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బాధితుల్లో అత్యధికులు సన్నకారు, చిన్నకారు రైతులేనని జగన్ పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ఆ కొద్దిపాటి భూమే జీవనాధారమని చెప్పారు. అదే భూమిలో పండే పంటతో కుటుంబాలను పోషించుకుంటున్నారని, పిల్లల చదువులు కొనసాగిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి రైతులు తమ భూమి తీసుకుంటే ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం సమాధానం చెప్పకుండా పోలీసు బలంతో అణచివేస్తోందని ఆరోపించారు. ధ్వంసమైన పంటలకు పరిహారం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు.

## భూముల స్వాధీనంపై ప్రశ్నలు

రాజధాని పేరుతో గతంలోనే వేల ఎకరాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ కొత్తగా భూములు ఎందుకు తీసుకుంటోందని జగన్ ప్రశ్నించారు. రైతుల అంగీకారం లేకుండా భూములపై ప్రణాళికలు రూపొందించడం, అవార్డులు ప్రకటించడం, పూర్తి వివరాలు తెలియజేయకుండా స్వాధీనం చేసుకోవడం న్యాయమేనా అని నిలదీశారు. పోలీసులను ప్రయోగించి రైతులపై ఒత్తిడి తీసుకురావడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఉండవల్లి ప్రాంతంలోని భూములు విజయవాడకు సమీపంలో ఉండటంతో అత్యంత విలువైనవని జగన్ పేర్కొన్నారు. చెన్నై-కోల్‌కత జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఈ భూములకు మార్కెట్ విలువ కంటే తక్కువ ధర నిర్ణయించి స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ భూములను భవిష్యత్తులో ఎవరికి కేటాయించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు జరుగుతున్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## బలవంతపు చర్యలు ఆపాలని డిమాండ్

రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తేనే ప్రభుత్వం తీసుకోవాలని, బలవంతంగా స్వాధీనం చేసుకోవడం సమంజసం కాదని జగన్ అన్నారు. పంటలను ధ్వంసం చేయడం, రైతులను భయపెట్టడం, పోలీసు బలంతో భూములు తీసుకోవడం అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండా ఒక్క సెంటు భూమిని కూడా స్వాధీనం చేసుకోవద్దని జగన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజధాని ప్రాంత రైతుల హక్కులను కాపాడేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన ప్రతి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఉండవల్లి ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బలవంతపు చర్యలను నిలిపివేయాలని జగన్ డిమాండ్ చేశారు.

# ఇకపై ఏఐతో యుద్ధాలు

- విజయం మాత్రం సైనికులదే
- సాంకేతికత, సైనిక బలం అవసరం
- ఐఎన్ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్

భవిష్యత్తులో యుద్ధాలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ సహాయంతో జరిగినా, తుది విజయాన్ని సాధించేది శిక్షణ పొందిన సైనికులేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో భారత నౌకాదళ తూర్పు నౌకాదళంలో స్వదేశీ స్టెల్త్ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరిని అధికారికంగా ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రతలో ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ సైనిక శక్తి కూడా సమానంగా కీలకమని పేర్కొన్నారు.

## మారుతున్న యుద్ధ స్వరూపం

యుద్ధాల స్వరూపం వేగంగా మారుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. డ్రోన్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ యుద్ధం, అంతరిక్ష సాంకేతికత, హైపర్‌సోనిక్ ఆయుధాలు, మానవరహిత వ్యవస్థలు రక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయని చెప్పారు. అయినప్పటికీ దేశభక్తి, సైనికుల శిక్షణ, బలమైన రక్షణ వ్యవస్థే విజయాన్ని నిర్ణయిస్తాయని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికత, సంప్రదాయ సైనిక సామర్థ్యం ఒకదానికొకటి పరస్పరపూరకమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రక్షణ, ఏరోస్పేస్ తయారీ రంగంలో కొత్త శక్తిగా ఎదుగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. కర్నూలును దేశ డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. సూరత్ వజ్రాల పరిశ్రమకు, బెంగళూరు ఐటీ రంగానికి ఎలా గుర్తింపో, అదే స్థాయిలో కర్నూలు డ్రోన్ తయారీ కేంద్రంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.



## మహేంద్రగిరి ప్రత్యేకతలు

స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి అత్యాధునిక యుద్ధనౌకగా రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. బ్రహ్మోస్ క్షిపణులు అమర్చే సామర్థ్యం, అత్యాధునిక రాడార్ వ్యవస్థ, గగనతల రక్షణ క్షిపణులు, జలాంతర్గామి నిరోధక వ్యవస్థ, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలతో ఈ నౌక సిద్ధంగా ఉందని చెప్పారు. సముద్ర భద్రత, శత్రు నౌకలపై దాడులు, నిఘా, విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో ఈ యుద్ధనౌక కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యానికి ప్రతీక అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రాజెక్ట్ 17ఏ కింద రూపొందించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్‌గా ఇది భారత నౌకాదళంలో చేరిందని చెప్పారు. నౌకాదళ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేసిన ఈ నౌకను ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ నిర్మించింది. సముద్ర భద్రత, ఆర్థిక రక్షణ పరస్పర అనుసంధానమై ఉన్నాయని పేర్కొంటూ, ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధే భారత లక్ష్యమని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

# రాధా గాయత్రి మృతి కేసులో ట్విస్ట్

- నెల తర్వాత భర్త శ్రీ చరణ్ అరెస్ట్


ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో హోమ్‌స్టేలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన నవవధువు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఘటన జరిగిన దాదాపు నెల రోజుల తర్వాత మృతురాలి భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. 27 ఏళ్ల రాధా గాయత్రి జూన్ 15న ముస్సోరీ సమీపంలోని ఓ హోమ్‌స్టేలో మృతిచెందింది. ఈ ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు, ఫిర్యాదు తర్వాత కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## ఢిల్లీ నుంచి విహారయాత్ర

పోలీసుల వివరాల ప్రకారం, విశాఖపట్నానికి చెందిన శ్రీచరణ్ ప్రస్తుతం ఢిల్లీలో నివసిస్తున్నాడు. భార్య రాధా గాయత్రితో కలిసి ఢిల్లీ నుంచి రిషికేశ్ వెళ్లి, అక్కడి నుంచి జూన్ 14 రాత్రి ముస్సోరీ సమీపంలోని హోమ్‌స్టేకు చేరుకున్నారు. తెల్లవారుజామున నిద్రలేచినప్పుడు భార్య ముక్కు నుంచి రక్తం కారుతున్నట్లు గుర్తించినట్లు శ్రీచరణ్ పోలీసులకు తెలిపాడు. అనంతరం ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు.

## తండ్రి ఫిర్యాదుతో మలుపు

మృతురాలి తండ్రి సుధాకర్ ఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెను భర్త హత్య చేశాడని ఆరోపించారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తొలుత హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన ఆధారాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా కట్న వేధింపుల కారణంగా మృతి చెందిన కేసుగా కూడా సంబంధిత చట్టాల కింద సెక్షన్లు చేర్చారు. అనంతరం పరారీలో



ఉన్న శ్రీచరణ్‌ను అరెస్ట్ చేశారు.

## వేధింపుల ఆరోపణలు

వివాహం తర్వాత నుంచి శ్రీచరణ్ అనుమానాలతో భార్యను తరచూ వేధించేవాడని మృతురాలి కుటుంబం ఆరోపిస్తోంది. ఆమె బ్యాగులో ట్రాకింగ్ పరికరం అమర్చాడని, ప్రతి విషయంలో అనుమానిస్తూ మానసికంగా ఇబ్బంది పెట్టేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విశాఖపట్నం వచ్చిన తర్వాత పూర్తి వివరాలు చెబుతానని రాధా గాయత్రి తన తండ్రికి ఫోన్‌లో చెప్పినట్లు వెల్లడించారు.

## దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు

ఘటన జరిగిన రోజున శ్రీచరణ్ రక్త నమూనాలు సేకరించలేదని, హోమ్‌స్టే గదిలో పూర్తి స్థాయి ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించాలని మృతురాలి కుటుంబం డిమాండ్ చేసింది. బీరులో మందులు కలిపి హత్య చేసి ఉండొచ్చన్న అనుమానాలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. అయితే మృతికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు. ఫోరెన్సిక్ నివేదికలు, శాస్త్రీయ ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉండటంతో పూర్తి నిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం పర్వదినాన భక్తుల రద్దీతో పోటెత్తింది. అయితే, స్వామివారిని దర్శించుకోవాలనే భక్తితో వచ్చిన భక్తులకు అక్కడ ఎదురవుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గంటలో ముగియాల్సిన దర్శనానికి ఏకంగా మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రూ. 200 ప్రత్యేక దర్శనం క్యూ లైన్లలో వీఐపీల సిఫార్సులు, సిబ్బంది అలసత్వం వల్ల క్యూ అస్సలు ముందుకు కదలడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి వివిధ రూపాల్లో భారీ ఆదాయం వస్తున్నప్పటికీ.. క్యూ లైన్లలో కూర్చునేందుకు బెంచీలు, తాగునీరు, విశ్రాంతి వంటి కనీస వసతులు కల్పించడంలో ఆలయ పాలక మండలి ఘోరంగా విఫలమైంది. దీనికి తోడు, ఆలయ పరిసరాల్లో మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడంతో కుటుంబ సభ్యులు విడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ టికెట్లను ప్రోత్సహిస్తున్న అధికారులు, కనీస నెట్‌వర్క్ సదుపాయం కల్పించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భక్తుల కష్టాలను తీర్చాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.**



## ధర్మ దర్శనమూ కష్టం దొరా..

# శ్రీవారే ఆలకించాలి భక్తుల మొర

- వాడపల్లిలో భక్తుల గోస
- వెంకన్న దర్శనం ఒక అగ్నిపరీక్ష!

పవిత్రమైన పర్వదినం.. మనసు నిండా భక్తిభావం.. కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలనే ఆశ.. ఇవన్నీ వెంటబెట్టుకుని వాడపల్లి ఆలయానికి వెళ్లే భక్తులకు అక్కడ ఎదురవుతున్న అనుభవాలు మాత్రం అత్యంత దారుణంగా ఉంటున్నాయి. స్వామివారిని కళ్లారా చూసుకుని తరించాలని వెళ్లే భక్తులకు, అక్కడ క్యూ లైన్లలో గడిపే గంటల సమయం భక్తిని పక్కన పెట్టి, తీవ్రమైన ఆగ్రహాన్ని, అసహనాన్ని కలిగిస్తోంది.

**గంటల కొద్దీ నిరీక్షణ.. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఇక్కట్లు**

పర్వదినాల్లో రద్దీ పెరగడం సహజమే. కానీ, ఆ రద్దీని తట్టుకునేలా, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆలయ పాలక మండలి, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంటలో పూర్తవ్వాల్సిన దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుండటంతో, గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడలేక వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొక్కులు తీర్చుకోవడానికి, ఏడు ప్రదక్షిణలు చేయడానికి ఆత్రుతగా వచ్చే భక్తులు, దర్శనం తర్వాత అలసటతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

**ప్రత్యేక దర్శనం.. పేరుకే తప్ప ప్రయోజనం శూన్యం**

ఆలయంలో 'ప్రత్యేక దర్శనం' పేరుతో నిర్వహిస్తున్న విధానం ఇప్పుడు భక్తుల ఆగ్రహానికి ప్రధాన కారణమవుతోంది. రూ.200 టికెట్లు కొనుక్కుని మరీ ప్రత్యేక దర్శనానికి వెళ్తే, ఉచిత దర్శనం కంటే ఎక్కువ సమయం పడుతోందని భక్తులు వాపోతున్నారు. దీనికి ప్రధాన కారణం.. ప్రత్యేక దర్శనం క్యూలైన్లలోనే వీఐపీలు, సిఫార్సులతో వచ్చే వారు, సేవా కార్యక్రమాల పేరుతో అధికారులకు అత్యంత సన్నిహితులు క్యూను దాటుకుని వెళ్లడం. దీనివల్ల సాధారణ భక్తుల దర్శనం గంటల కొద్దీ ఆగిపోతోంది. ఉచిత దర్శనం తరహాలో, ప్రత్యేక దర్శనానికి కూడా పద్ధతి గల క్యూ మేనేజ్‌మెంట్ లేకపోవడం పాలక మండలి అవగాహన లోపానికి అద్దం పడుతోంది.

**వసతుల కల్పనలో నిర్లక్ష్యం**

ఆలయానికి పార్కింగ్ ఫీజులు, దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, విరాళాల రూపంలో భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఆదాయంతో భక్తులకు మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ, కనీసం క్యూ లైన్లలో కూర్చునేందుకు బెంచీలు కూడా లేకపోవడం, తాగునీటి సౌకర్యం అంతంత మాత్రమే ఉండటం భక్తులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. ఆలయం ఒక వ్యాపార కేంద్రంలా మారుతోందే తప్ప, భక్తుల సౌకర్యాల వైపు చూడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**డిజిటల్ యుగంలో.. 'నెట్‌వర్క్' లేని దేవుడి కోట**

మరో విడ్డూరమైన విషయం ఏమిటంటే.. దర్శనం, ప్రసాదం టికెట్లను వాట్సాప్ ద్వారా తీసుకోవాలని, డిజిటల్ లావాదేవీలు చేయాలని అధికారులు సూచిస్తారు. కానీ, ఆశ్చర్యకరంగా ఆలయ పరిసరాల్లో మొబైల్ నెట్‌వర్క్ అసలే అందుబాటులో ఉండదు. ఎయిర్‌టెల్, జియో వంటి ప్రధాన నెట్‌వర్క్‌లు కూడా పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు విడిపోయినా ఒకరిని ఒకరు సంప్రదించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రోత్సహించే ముందు, కనీస టెక్నాలజీ మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత లేదా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**పాలక మండలి మేల్కొనేది ఎన్నడు?**

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తుల పాలిట కల్పతరువు. కానీ, ప్రస్తుత పరిస్థితులు భక్తుల సహనానికి పరీక్షగా మారాయి. పర్వదినాల్లో రద్దీ పెరగడం సహజమే అయినప్పటికీ, దానికి తగ్గట్టుగా ముందస్తు ప్రణాళికలు రచించడంలో ఆలయ పాలక మండలి, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రత్యేక దర్శనాల పేరిట సామాన్య భక్తులను గంటల తరబడి నిరీక్షించేలా చేయడం, కనీస తాగునీరు, నీడ, మొబైల్ నెట్‌వర్క్ వంటి సౌకర్యాలను కల్పించకపోవడం వారి ఘోర నిర్లక్ష్యాన్ని నిరూపిస్తోంది. కానుకలు, టికెట్ల రూపంలో ఆలయానికి భారీగా ఆదాయం వస్తున్నా, దానిని భక్తుల వసతుల కోసం ఖర్చు చేయకపోవడం విచారకరం. ఇప్పటికైనా ఆలయ పాలక మండలి నిద్రమత్తు వీడాలి. వీఐపీ సంస్కృతిని పక్కనపెట్టి, క్యూ మేనేజ్‌మెంట్‌ను క్రమబద్ధీకరించాలి. సాంకేతిక లోపాలను, నెట్‌వర్క్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, భక్తులకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన దర్శన భాగ్యాన్ని కల్పించాలి. భక్తుల కన్నీళ్లు తుడిచి, వారి గోసను ఆలకించినప్పుడే ఆలయ పవిత్రతకు, పాలక మండలికి సార్థకత చేకూరుతుంది.

# జర జాగ్రత్త.. కడపలో కరోనా

- అధికారులకు మంత్రి ఆదేశాలు

కడప జిల్లాలో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు వెంటనే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎనిమిది కరోనా కేసులు నమోదవడం, ఇద్దరు మృతి చెందడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, డీఎంహెచ్‌వో రవిబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాలు, ఆస్పత్రుల వద్ద మాస్క్ ధరించడం తప్పనిసరి చేయాలని చెప్పారు. కరోనా లక్షణాలు ఉన్నవారికి వెంటనే పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఐసోలేషన్‌లో ఉంచాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## షాబాద్ హత్యల కేసులో మిస్టరీ

- **భార్యా పిల్లలను చంపడంతో ఉత్కంఠ**

షాబాద్‌లో ఆరుగురి హత్యల ఘటనపై ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఘటనాస్థలాన్ని పరిశీలించి కీలక వివరాలు వెల్లడించారు. రాత్రి రెండు వేర్వేరు ప్రాంతాల్లో హత్యలు జరిగినట్లు తెలిపారు. మొదట నిందితుడు రాజ్‌కుమార్ మైనర్ బాలిక ఇంటికి వెళ్లి ఆమెను తీసుకెళ్లే ప్రయత్నంలో అడ్డుకున్న తల్లి, నాయనమ్మను హత్య చేశాడన్నారు. అనంతరం బాలికను చెరువు సమీపానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు వివరించారు. తర్వాత తన ఇంటికి వెళ్లి భార్య సరితతో పాటు ఇద్దరు చిన్నారులను కూడా దారుణంగా చంపాడని చెప్పారు. హత్యల అనంతరం నిందితుడు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆరుగురిని చంపినట్లు చెప్పినట్లు సీపీ వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న రాజ్‌కుమార్ కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయని చెప్పారు. సొంత భార్యా పిల్లలను కూడా హత్య చేయడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందని, దాని వెనుక కారణం ఏమిటన్నది దర్యాప్తులో కీలక అంశంగా మారిందని సీపీ తరుణ్ జోషి పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.

## ట్రంప్ ఘాటు హెచ్చరిక..

- **నన్ను లక్ష్యంగా చేస్తే ఇరాన్‌పై క్షిపణుల వర్షం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తనపై హత్యాయత్నం జరిగితే ఇరాన్‌పై ఊహించని స్థాయిలో ప్రతీకార దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. ఇప్పటికే వెయ్యి క్షిపణులు సిద్ధంగా ఉంచామని, అవసరమైతే మరింత భారీ దాడులకు కూడా సైన్యానికి ముందుగానే ఆదేశాలు ఇచ్చినట్లు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా వెల్లడించారు. ఇరాన్‌లోని కీలక లక్ష్యాలను పూర్తిగా ధ్వంసం చేసే సామర్థ్యం అమెరికా సైన్యానికి ఉందని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం అంశాలపై ఇప్పటికే రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి.
మరోవైపు ట్రంప్ ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా ఒప్పందాలను ఉల్లంఘిస్తే తమ దేశ రక్షణ కోసం అవసరమైన ప్రతిచర్య తప్పదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ హెచ్చరించారు. యుద్ధం ముగిసిందని చెప్పడం వాస్తవం కాదని, తమ దేశం ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగిపోదని స్పష్టం చేశారు. దీంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# అలల్లో కలిసిన కలలు

- **వియత్నాంలో విషాద యాత్ర**
- **భారతీయుల బలిగొన్న సముద్రం**
- **బోటు బోల్తాపడడంతో పెను ప్రమాదం**
- **ముగ్గురు ఏపీ వాసులు మృతి**
  **అధికారులతో మాట్లాడిన నారా లోకేశ్**



వియత్నాంలో భారతీయ పర్యాటకులను విషాదం వెంటాడింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడటంతో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బోటులో మొత్తం 36 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో 32 మంది భారతీయ పర్యాటకులు, ముగ్గురు సిబ్బంది, ఒక సహాయక సిబ్బంది ఉన్నారు. హోన్ మే రుట్ స్గోయి ద్వీపం నుంచి ఆన్ థోయ్ పోర్టుకు బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.

### 21 మందిని రక్షించిన సహాయక బృందాలు

ప్రమాదం జరిగిన వెంటనే వియత్నాం సహాయక బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఇప్పటివరకు 21 మందిని సురక్షితంగా బయటకు తీసి ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సముద్రంలో భారీ అలలు, బలమైన గాలులు వీచిన సమయంలో బోటు అదుపు తప్పి బోల్తాపడినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

### భారత రాయబార కార్యాలయం అప్రమత్తం

ఈ ఘటనపై హనోయిలోని భారత రాయబార కార్యాలయం వెంటనే స్పందించింది. బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు హనోయి రాయబార కార్యాలయం, హోచిమిన్ నగరంలోని భారత కాన్సులేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. భారత రాయబారి అధికారులతో కలిసి ఫు క్వాక్ ద్వీపానికి బయలుదేరారు. స్థానిక అధికారులతో సమన్వయం చేస్తూ బాధిత భారతీయులకు అన్ని విధాల సహాయం అందిస్తున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది.

### లావా సంస్థ ఉద్యోగులు కూడా బాధితులే

ఈ ప్రమాదంలో ప్రముఖ మొబైల్ సంస్థ లావాకు చెందిన ఉద్యోగులు, డిస్ట్రిబ్యూటర్లు కూడా ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. దక్షిణ భారతానికి చెందిన మొత్తం 110 మంది ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు వియత్నాం పర్యటనకు వెళ్లినట్లు సమాచారం. బాధితుల కుటుంబాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నామని, అవసరమైన సహాయం అందిస్తున్నామని లావా సంస్థ తెలిపింది.

### మోదీ, రాహుల్ సంతాపం

ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భారత రాయబార కార్యాలయం పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గల్లంతైన వారి కోసం రక్షణ చర్యలు వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

### ఏపీ పర్యాటకులపై ఆందోళన

ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మంత్రి నారా లోకేశ్ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. విదేశీ విహారయాత్రగా ప్రారంభమైన ఈ ప్రయాణం అనేక భారతీయ కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది.

### వియత్నాం విషాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

వియత్నాంలో ఫు క్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన పడవ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మృతదేహాలను త్వరగా స్వదేశానికి తీసుకురావాలని, బాధితులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి నారా లోకేశ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీలోని ఆంధ్ర భవన్ ప్రత్యేక బృందం వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, స్థానిక అధికారులతో సమన్వయం చేస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తోంది. గాయపడిన మచిలీపట్నానికి చెందిన గెల్లి కిషోర్ త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

## రాశి ఫలితాలు

**12.07.2026–**
**18. 07. 2026 వరకు**

**మేష రాశి :** ప్రణాళికలను అమలు చేయలేని పరిస్థితిని గమనిస్తారు. పుణ్యక్షేత్రాలకి వెళ్లాలని ఆలోచన చేస్తారు. సన్నిహితులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవటం చెప్పదగు సూచన. విద్యార్థులకు సామాన్యం. అప్పు చేయాల్సిన పరిస్థితి రావచ్చు. గొంతు, నేత్ర సంబంధ రోగాలపై శ్రద్ధ తీసుకోవాలి. సహచర ఉద్యోగులతో సఖ్యతగా మెలగాలి. లౌక్యంగా మాట్లాడగలరు. మంగళవారం సాయంకాలం రుద్రాభిషేకం చేయించగలరు.

**వృషభ రాశి :** ఆకస్మిక ప్రయాణాలు. విద్యార్థులు ఆశించిన విద్యను అభ్యసించగలుగుతారు. భావావేశాన్ని తగ్గించుకొని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. ఆర్థిక అసమానతలు కొనసాగుతాయి. ఇంటి ఖర్చులు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి. దంపతుల మధ్య సఖ్యత పెంచుకోవాలి. నూతన వస్తు, వాహనము కొనుగోలుకు ఆస్కారం. నూతన వస్తు వాహనాలు కొనుగోలుకు ఆస్కారం. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కరావలంబ స్తోత్రాన్ని పారాయణ చేయగలరు.

**మిథున రాశి :** : కళాకారులకి ప్రోత్సాహకంగా ఉండును. హృద్రోగస్తులు ఆరోగ్యం పై శ్రద్ధ ఉంచాలి. ప్రేమికులు సంతోషంగా ఉంటారు. ఉద్యోగస్తులకు పదోన్నతితో కూడిన స్థాన చలనానికి ఆస్కారం ఉంది. రాబడి కి తగిన ఖర్చు ఉండును. విదేశీ విద్యను అభ్యసించాలనుకునే వారికి అనుకూలం. సూర్యాష్టక పారాయణ మేలు చేస్తుంది. సుబ్రహ్మణ్య అభిషేకం గ్రహదోష తీవ్రతను తగ్గిస్తుంది.

**కర్కాటక రాశి:** ఆరోగ్యము ఆర్థికము అసమానతలు ఉన్నప్పటికీ దైవశక్తితో సమయస్ఫూర్తితో పనులను సానుకూలం చేసుకుంటున్నారు. విదేశ విద్య ను అభ్యసించాలనుకునే వారికి అనుకూలం. వ్యాపారస్తులకు కౌంటర్ సేల్ బాగానే ఉన్నా రాణి బాకీలు బెడద మనోవేదనకు గురిచేస్తుంది. రియల్ ఎస్టేట్ వారికి లాభదాయకం. రక్తసంబంధీకులతో సమస్యలను పరిష్కరించుకోగలరు. స్థిరాస్తి కొనుగోలుకు ఆస్కారం. ఈ వారం అధిక గ్రహాలు అనుకూలిస్తున్నాయి.

**సింహరాశి:** ఉద్యోగ వ్యాపారస్తులకు అనుకూలమైన వారము. తండ్రి తరపు బంధువులతో సఖ్యతగా ఉంటారు. ప్రజా జీవనం చేసే వారికి పేరు ప్రఖ్యాతలు కలుగును. నిరుద్యోగులకు ఆశాజనకం. విద్యార్థులకి అనుకూలం. ఆకర్షణీయంగా కనబడతారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్యాభర్తలు సంతోషంగా ఉంటారు. కాలభైరవ అష్టక పారాయణ మేలు చేస్తుంది.

**కన్యారాశి :** ప్రభుత్వ ఉద్యోగులు గౌరవమర్యాదలు రోజురోజుకీ వృద్ధి అవుతున్నాయి. విద్యార్థుల మనోభావాలు నెరవేరును. అవ్వవలసిన పనులు సానుకూలం. సమయస్ఫూర్తి కలిగి శ్రమతోనే పనులు సానుకూలం చేసుకుంటున్నారు. గోమాత సేవ సకల దోష హరణం.

**తులారాశి :** భార్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ శ్రద్ధ వహిస్తూ సఖ్యత పెంచుకోవాలి. ఆర్థిక సద్దుబాటులు అవుతున్నాయి. తొందరపడి మాట్లాడవద్దు సుమా! అదృష్ట స్థానం బలంగా ఉంది కాబట్టి తలపెట్టిన కార్యాలు సానుకూలం అగును. గృహపకరణాలు రిపేర్ అయ్యేందుకు ఆస్కారం ఉంది. ఉన్నత విద్యను అభ్యసించాలి అని భావించే వారికి అనుకూల గ్రహస్థితి. సంతానం అభివృద్ధికి బాట వేస్తారు. ప్రయాణాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోగలరు. నవగ్రహ ప్రదక్షిణ విష్ణు సహస్రనామావళి పారాయణ మేలు చేస్తాయి.

**వృశ్చిక రాశి:** విద్యార్థులు శ్రద్ధగా అభ్యసిస్తే మంచి మార్కులు లభిస్తాయి. విద్యార్థులు దక్షిణామూర్తి స్తోత్రాన్ని పారాయణ చేయగలరు. గురు శుక్రవారాలలో ఆరోగ్యం నడతగా ఉంద గలదు. పట్టుదలతో పనులను సానుకూలం చేసుకోవాలి. బంధుమిత్రులతో వివాదాలకు పోవద్దు. మంద బుద్ధిని అధికమించాలి. గ్యాస్టిక్ ట్రబుల్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోగలరు. భార్య ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి. అని రంగాల్లో ఉండే వారికి బాగా కష్టపడితే గాని ఫలితం దక్కదు అని గ్రహించాలి. నిరుద్యోగులకు ఆశాజనకంగానే ఉంది. లలితా సహస్రనామావళి పారాయణ గ్రహదోష తీవ్రతను తగ్గించగలదు.

**ధనస్సు రాశి :** అకారణంగా కలహాలకు ఆస్కారం ఉంది. ఖర్చులు నియంత్రించుకోవాలి. మితంగా మాట్లాడాలి. వ్యసనాలకు దూరంగా ఉండగలరు. సంతానం అభివృద్ధికై అన్ని రకాల శ్రమిస్తారు. జీవిత భాగస్వామి సహకారం మేలు చేస్తుంది. వ్యాపారస్తులు అప్పు ఇవ్వకపోవడం మంచిది. నవగ్రహ స్తోత్ర పారాయణ... రావి చెట్టు ప్రదక్షణ మేలు చేస్తాయి.

**మకర రాశి:** పనులు మందకొడిగా సాగుతున్నాయి. అనవసరమైన పట్టుదలలకు పోవద్దు. పట్టు విడుపు ఉండాలి కదండీ. భార్య సహకారం వలన మేలు జరుగుతుంది. వాత రోగ, పిత్త రోగ అనారోగ్యాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోగలరు. చికాకు బాగా తగ్గాలి. సంతానం తొందరపాటుని ఉపేక్షించవద్దు. ఆర్థిక సదుపాట్లు అవుతున్నాయి. అన్ని రంగాల్లో ఉండే వారికి శని వజ్ర పంజర కవచ స్తోత్ర పారాయణ మేలు చేస్తుంది. శనివారం పెరుగన్నం దానం చేయండి.

**కుంభరాశి :** మీన రాశి : ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు మంచి యూనివర్సిటీలలో సీటు వస్తుంది. తల్లి ఆశీస్సులు సలహా మేలు చేస్తాయి. గృహ యోగానికి ఆస్కారం ఉంది. ఉద్యోగస్తులు సొంత తెలివితేటలతో ఉన్నతాధికారుల వద్ద మంచి పేరు తెచ్చుకుంటారు. అన్ని రంగాల్లో ఉన్నవారు కాలభైరవాష్టకాన్ని పారాయణ చేయడం వలన మేలు జరుగుతుంది. పెరుగన్నం దానం చేయగలరు.

**మీన రాశి :** ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు మంచి యూనివర్సిటీలలో సీటు వస్తుంది. తల్లి ఆశీస్సులు సలహా మేలు చేస్తాయి. గృహ యోగానికి ఆస్కారం ఉంది. ఉద్యోగస్తులు సొంత తెలివితేటలతో ఉన్నతాధికారుల వద్ద మంచి పేరు తెచ్చుకుంటారు. అన్ని రంగాల్లో ఉన్న వారు కాలభైరవాష్టకాన్ని పారాయణ చేయడం వలన మేలు జరుగుతుంది. పెరుగన్నం దానం చేయగలరు.

**టీటీడీ అనుబంధ సంస్థ**
**సమరసత సిద్ధాంతి**
**'దైవజ్ఞ ' పులిపాక చంద్రశేఖర శర్మ**
**శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005**






## ద్వారపూడికి కమ్యూనిటీ హాల్ వరం

- **రూ.15.75 లక్షలతో శంకుస్థాపన**



మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గ ప్రజల కోసం నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా రూ.15.75 లక్షల వ్యయంతో ఈ భవనం నిర్మించనున్నారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, కార్యకర్తలు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. శంకుస్థాపన అనంతరం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం గ్రామ ప్రజల చిరకాల కోరిక అని, అది నెరవేరడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినందుకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




## యువతకు క్రీడల పిలుపు

- **అమరావతి ఛాంపియన్‌షిప్-2026**
- **పోస్టర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల**

మారుమూల గ్రామాలు, పట్టణాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్-2026కు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల పోస్టర్‌ను మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆవిష్కరించారు. జూలై 15 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. అండర్17, అండర్23 విభాగాల్లో బాలురు, బాలికల కోసం అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా సహా మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూలై 15 నుంచి 25 వరకు నియోజకవర్గ స్థాయి, జూలై 26 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా స్థాయి, ఆగస్టు 21 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయని చెప్పారు. విజేతలకు ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. గెలుపోటముల కంటే పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, యువత సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడా మైదానాల్లో తమ ప్రతిభను నిరూపించాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గల క్రీడాకారులు క్రీడాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఆధార్ ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అర్హులైన ప్రతి యువకుడు, యువతి పోటీల్లో పాల్గొనేలా సహకరించాలని కోరారు.

## రక్తానికి రక్తం

- పగ తీర్చుకుంటాం
- ట్రంప్‌కు వార్నింగ్
- మోజ్తబా హెచ్చరిక

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ అంత్యక్రియల సందర్భంగా ఆయన కుమారుడు, ప్రస్తుత సుప్రీం నాయకుడు మొజ్తబా ఖమేనీ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తన తండ్రి రక్తానికి తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రకటించారు. యుద్ధంలో మరణించిన వారందరికీ న్యాయం జరిగే వరకు ఇరాన్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ఒక లేఖ విడుదల చేశారు. శత్రువుల రక్తంతో ఈ త్యాగానికి న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### ప్రజల మద్దతు: అంత్యక్రియల్లో జనసందోహం

ఇరాన్ ప్రజలు ఈ ప్రతీకార చర్యను తీవ్రంగా కోరుకుంటున్నారు. అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్, ఇరాక్ దేశాల నుండి లక్షలాది మంది తరలివచ్చారు. టెహ్రాన్, కాం, నజాఫ్, కర్బలా నగరాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజలందరూ చూపించిన ఈ మద్దతుకు మోజ్తబా కృతజ్ఞతలు తెలిపారు. ఈ భారీ జనసందోహం శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించిందని ఆయన అన్నారు.

### కాలం నిర్ణయిస్తుంది: పగ మారదు

తాము పదవుల్లో ఉన్నా లేకపోయినా ఈ ప్రతీకారం కచ్చితంగా జరుగుతుందని మోజ్తబా స్పష్టం చేశారు. నాయకులు మారవచ్చు కానీ శత్రువులపై పగ మారదు. ఇది కేవలం ఒక వ్యక్తిగత విషయం కాదు. ఇది ఇరాన్ దేశ గౌరవానికి సంబంధించిన సమస్య. అమరులైన ప్రతి ఒక్కరి రక్తం వృధా పోదని ఆయన గట్టిగా చెప్పారు.

### ట్రంప్ హెచ్చరిక: అమెరికా సిద్ధం

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయంలో స్పందించారు. ఇరాన్ తనను చంపడానికి చాలా కాలంగా ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ఒకవేళ తనకు ఏదైనా జరిగితే ఇరాన్ పై తీవ్రమైన దాడులు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎవరూ చూడని స్థాయిలో బాంబుల దాడి జరుగుతుందని హెచ్చరించారు. ఇజ్రాయెల్ కూడా భద్రతా హెచ్చరికలు జారీ చేసింది.

## సెమీకండక్టర్ రంగంలో బంగారు భవిష్యత్

- **యువతకు అశ్విని వైష్ణవ్ పిలుపు**

ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో భారత్ ఇప్పటికే బలమైన స్థానం సంపాదించిందన్నారు. విద్యార్థులకు అత్యాధునిక చిప్ డిజైన్ నైపుణ్యాలు అందించేందుకు 315 విశ్వవిద్యాలయాలకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం వేగంగా విస్తరిస్తోందని, ప్రస్తుతం దాని విలువ రూ.13 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. త్వరలో అది రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. ఇప్పటికే ఈ రంగంలో 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. తెలంగాణలో 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తుండగా, నాలుగు భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌తో సెమీకండక్టర్లు, బుల్లెట్ రైళ్లు, ఆధునిక రైల్వే వ్యవస్థ వంటి రంగాల్లో భారత్ ప్రపంచస్థాయికి చేరుకుంటోందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

## పానీపూరీ ఆస్వాదించిన అశ్విని వైష్ణవ్

హైదరాబాద్ పర్యటనలో కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కాసేపు సరదాగా గడిపారు. హెచ్ఐసీసీలో నిర్వహించిన 'వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' సదస్సులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన చాట్ బండార్ వద్ద పానీపూరీ రుచి చూశారు. పానీపూరీ ఆస్వాదించిన తర్వాత డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తూ యూపీఐ ద్వారా రూ.175 చెల్లించారు. కేంద్ర మంత్రి సాధారణ వినియోగదారిలా డిజిటల్ పేమెంట్ చేయడం అక్కడ ఉన్న వారిని ఆకట్టుకుంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఎమిరేట్స్‌కు సీఎం ఆహ్వానం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ సంస్థ భారత్‌లో 25 ఏళ్ల సేవల సందర్భంగా ఈ భేటీలో విమానయాన విస్తరణపై చర్చ జరిగింది. హైదరాబాద్‌లో ఎమిరేట్స్ ఏ-380 సేవలు ప్రారంభించేందుకు సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. తెలంగాణలో త్వరలో ఏర్పాటు కానున్న రెండు కొత్త విమానాశ్రయాల నుంచీ కూడా ఎమిరేట్స్ సేవలు ప్రారంభించాలని సీఎం కోరారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారుల శిక్షణకు స్పాన్సర్‌షిప్ అందించాలని కూడా రేవంత్‌రెడ్డి కోరగా, సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

## సెమీకండక్టర్ రంగంలో తెలంగాణకు మరో మైలురాయి

సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ (కెమికల్ మెకానికల్ పాలిషింగ్) ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లోని టీవర్క్స్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఏర్పాటైన ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ లభించనుంది. వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీ ప్రారంభించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. తెలంగాణను దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# చీరాల విద్యారంగంలో సరికొత్త చరిత్ర

» ఐఐటీ ఖరగ్‌పూర్ నుండి పోస్ట్ డాక్టరల్ సాధించిన డా॥ జగదీష్ బాబు
» సెయింట్ ఆన్స్ కాలేజ్ కీర్తి కిరీటంలో మరో మైలురాయి



**వేటపాలెం, జులై 11 (నాదేశం) :** స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి ప్రిన్సిపాల్ డా॥ కె. జగదీష్ బాబు ప్రతిష్టాత్మకమైన పోస్ట్ డాక్టోరల్ (సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ రీసెర్చ్) సాధించారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి ఖరగ్‌పూర్ నుండి ఆయన ఈ అరుదైన గుర్తింపును అందుకున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ ఖరగ్‌పూర్ వారు ఇటీవల నిర్వహించిన 72వ స్నాతకోత్సవంలో డా॥ కె. జగదీష్ బాబుకు ఈ సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ రీసెర్చ్ ను అధికారికంగా ప్రధానం చేసినట్లు యాజమాన్యం పేర్కొంది. ప్రిన్సిపాల్ డా॥ కె. జగదీష్ బాబు పోస్ట్ డాక్టోరల్ సాధించిన సందర్భముగా కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ అరుదైన మైలురాయిని అందుకున్న ఆయనను కళాశాల డైరక్టర్లు డా॥ సి.సుబ్బారావు,వనమా దొర నాగ సాయినాద్, మేనేజర్ ఆర్.వి.రమణమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు ప్రిన్సిపాల్ డా॥ కె. జగదీష్ బాబుకు ఘనంగా సత్కరించారు.

# తాగి స్టీరింగ్ పడితే జేబు ఖాళీ

» కారంచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురికి రూ. 40 వేలు జరిమానా వేసిన కోర్టు
» మరోసారి దొరికితే కఠిన శిక్ష తప్పదని ఎస్ఐ ఖాదర్ బాషా హెచ్చరిక



**కారంచేడు, జులై 11 (నాదేశం) :** మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురు వ్యక్తులకు కోర్టు భారీ జరిమానా విధించింది. కారంచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని శనివారం కారంచేడు పోలీసులు పర్చూరు కోర్టుకు హాజరు పరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.40,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

నిందితులకు ఇది మొదటి తప్పుగా కేవలం జరిమానాతోనే వదిలిపెడుతున్నామని, మరోసారి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో దొరికితే శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని అటు కోర్టు, ఇటు పోలీసులు హెచ్చరించారు.

మద్యం తాగడం వల్ల జీవితాలు ఛిద్రమవడమే కాకుండా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని కారంచేడు ఎస్ఐ ఖాదర్ బాషా అన్నారు. ఇలాంటి ప్రమాదాల వల్ల ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఫలితంగా వారి కుటుంబాలకు తీరని వేదన, శోకమే మిగులుతుందని పేర్కొన్నారు.



# ఆంటీలపై పెరుగుతున్న మోజు..

6లో..

## యువతలో మొదలైన వికృత క్రేజు

ఒకప్పుడు ప్రేమ అంటే రెండు హృదయాల కలయిక. ఇప్పుడు ప్రేమ అంటే కోట్ల వ్యూస్, లక్షల లైక్స్, వైరల్ రీల్స్. స్క్రీన్‌పై మొదలైన ఒక ట్రెండ్... నెమ్మదిగా సమాజం ఆలోచనలనే మార్చేస్తోంది. తమకంటే ఎక్కువ వయసు ఉన్న మహిళలతో యువకుల ప్రేమ కథలు నేడు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. కొందరికి అది ధైర్యమైన నిర్ణయం. మరికొందరికి అది విలువల పతనానికి సంకేతం. ప్రేమకు నిజంగానే వయసు అడ్డుకాదా? లేక మార్కెట్ సృష్టించిన కొత్త మోజునా? మనసులు కలవడం గొప్పదా? లేక సంచలనం కావడమే లక్ష్యమా? ప్రేమ పేరుతో మారుతున్న ఆలోచనలు... మారిపోతున్న కుటుంబ బంధాలు... ప్రశ్నలు వేస్తున్న భారతీయ విలువలు... ఈ చర్చలో సరైనది ఎవరు? తప్పు ఎవరు? తీర్పు చెప్పడం కాదు ఈ కథ ఉద్దేశం. వైరల్ ప్రపంచం వెనుక కనిపించని వాస్తవాలను... ప్రేమ అనే పదం కోల్పోతున్న అసలు అర్థాన్ని... మన సమాజం నడుస్తున్న దారిని ఒకసారి ఆగి ఆలోచించాల్సిన సమయం వచ్చిందని గుర్తు చేయడమే ఈ ప్రయాణం.



# వియత్నాం విషాదం

◆ అలలలో కలిసిన ప్రాణాలు
◆ విహార యాత్రలో ఘోర ప్రమాదం
◆ పర్యాటకుల కలల యాత్ర కన్నీటి గాథ

విహారయాత్రగా ప్రారంభమైన ప్రయాణం... క్షణాల్లో విషాదగాథగా మారింది. నవ్వులు పంచుకోవాల్సిన సముద్ర విహారం కన్నీటి సంద్రంగా మారిపోయింది. వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో స్పీడ్‌బోట్ బోల్తా పడటంతో కనీసం 15 మంది భారతీయ పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబాలతో సంతోషంగా గడపాలని వెళ్లిన వారు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఇంకా గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు ఆందోళనను మరింత పెంచుతున్నాయి. విదేశీ నేలపై చోటుచేసుకున్న ఈ హృదయవిదారక ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ఆనంద యాత్ర ఒక్కసారిగా శోకయాత్రగా మారిపోవడం ప్రతి భారతీయుడి మనసును భారంగా మార్చింది.

(వివరాలు 5లో..)



2లో..

# భారత్-కివీస్ బంధం బలోపేతం

◆ న్యూజిలాండ్‌తో వ్యూహాత్మక బంధం
◆ విజయవంతంగా ముగిసిన మోదీ టూర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల విదేశీ పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్‌లో రెండు రోజుల పర్యటన పూర్తి చేశారు. నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి న్యూజిలాండ్‌ను సందర్శించడం చారిత్రాత్మకంగా నిలిచింది. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ మోదీకి వీడ్కోలు పలికారు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయి.



# వాళ్లూ వీళ్లూ ఎందుకు.. నేనే బరిలో దిగుతా

• హరీశ్‌పై పోటీకి సై అన్న జగ్గారెడ్డి • సిద్దిపేటలో కొత్త సమీకరణం

సిద్దిపేట రాజకీయాలు మరోసారి హీట్ ఎక్కుతున్నాయి. హరీశ్‌రావు కంచుకోటగా పేరొందిన ఈ నియోజకవర్గంపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి చేసిన సవాల్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. "వాళ్లు.. వీళ్లు ఎందుకు? పార్టీ ఆదేశిస్తే నేనే బరిలో దిగుతా" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. వ్యక్తిగత లెక్కలు కాదని, పార్టీ నిర్ణయమే తన నిర్ణయమని స్పష్టం చేయడం ఈ ప్రకటనకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. ఒకవైపు హరీశ్‌రావు బలమైన నాయకత్వం, మరోవైపు కాంగ్రెస్ దూకుడు కలిసివచ్చిన వేళ సిద్దిపేటలో పోటీపై ఇప్పటి నుంచే రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

(వివరాలు 5లో..)

# కావాలనే పంపులు ఆన్ చేయడం లేదు

## హరీష్‌రావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేయడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తున్న నీటి సమస్య సహజ కరవు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వల్ల ఏర్పడిన పరిస్థితి అని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గోదావరి నదిలో తగినంత నీరు ఉన్నప్పటికీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టడం లేదని హరీష్‌రావు అన్నారు. కన్నెపల్లి పంపులు ప్రారంభిస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరం కూడా సాగు కాలేదన్న సీఎం వ్యాఖ్యలు వాస్తవాలకు దూరమని విమర్శించారు. ఒకప్పుడు తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసిన తిమ్మాయిపల్లి, ఇప్పుడు కాళేశ్వరం జలాలతో పచ్చని పంటలతో కళకళలాడుతోందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా మంచి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే పంపులను ప్రారంభించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# టార్గెట్ ఈటల



5లో..


◆ కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు
◆ మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్‌ఏ ఆదేశాలు
◆ గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం
◆ గేట్లు మూస్తే ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందని హెచ్చరిక
◆ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటల వ్యాఖ్యలు
◆ బీఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటల
◆ కేంద్రంతో కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
◆ ఈటల, బీఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
◆ కాళేశ్వరం గేట్ల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు.

# షాబాద్‌లో రక్తపాతం..

◆ సైకో కిరాతకం కలకలం
◆ అర్ధరాత్రి అమానుషం
◆ ఆరుగురి హత్యతో ఉలిక్కిపడ్డ తెలంగాణ

5లో..



రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పోక్సో కేసులో ఇటీవలే బెయిల్‌పై విడుదలైన ఓ వ్యక్తి ఏకంగా ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. దైవాలగూడ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. కక్షతో రెచ్చిపోయిన నిందితుడు రాజ్‌కుమార్ కత్తితో మారణహోమం సృష్టించి అనంతరం పరారయ్యాడు. ఒకే రాత్రిలో ఆరు ప్రాణాలు కోల్పోవడం గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది.

# ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే

## ప్రభుత్వ వైఫల్యం వల్లే షాబాద్ ఘటన: కేటీఆర్



రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలేనని ఆరోపించారు. పోక్సో కేసులో నిందితుడికి బెయిల్ రాకుండా ప్రభుత్వం కోర్టులో బలంగా వాదించలేదని విమర్శించారు. హోంశాఖ వైఫల్యం, ప్రభుత్వ న్యాయవాదుల నిర్లక్ష్యమే ఈ దారుణానికి కారణమని అన్నారు. ఇలాంటి ప్రమాదకర నిందితులకు బెయిల్ ఎలా వచ్చిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబం ముందుగానే భయాందోళనలు వ్యక్తం చేసినా తగిన చర్యలు తీసుకోలేదని కేటీఆర్ మండిపడ్డారు. మహిళల భద్రతపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని కోరారు.





# మరలి రాని లోకాలకు మరపు రాని స్వరం..

»దివికేగిన గాన కోకిల
»ఎస్ జానకి కన్నుమూత

**క్లాసికల్ సంగీతమైనా.. క్యాబరే సాంగైనా.. పసిపిల్ల గొంతు నుంచి పండు ముసలమ్మ వరకు ఎవరి గొంతుకకైనా సరిపడే ఏకైక ప్లే బ్యాక్ వాయిస్ ఎస్. జానకిదే అనడంలో సందేహం లేదు...**

సినీ సంగీత వినీలాకాశంలో ఎస్. జానకి ఓ ధ్రువతార. కాలం మారినా, తరాలు మారినా ఆమె గాత్ర మాధుర్యం మాత్రం ఎన్నడూ వెలుగు కోల్పోలేదు. ప్రతి పాటలో భావానికి ప్రాణం పోసిన ఆమె స్వరం కోట్లాది సంగీతాభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంది. ప్రేమకు మాధుర్యం, భక్తికి పవిత్రత, విషాదానికి ఆవేదన, ఆనందానికి ఉత్సాహం అందించిన గాన కోకిలగా ఆమె నిలిచారు. దక్షిణ భారత సినీ సంగీతాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన అపూర్వ గాత్రం ఇక వినిపించదనే వార్త సంగీత ప్రపంచాన్ని శోకసంద్రంలో ముంచేసింది. ఆమె భౌతికంగా దూరమైనా, ప్రతి ఇంట్లో వినిపించే పాటల్లో, ప్రతి సంగీతాభిమాని హృదయంలో, ప్రతి జ్ఞాపకంలో ఆమె స్వరం చిరకాలం సజీవంగానే నిలిచిపోతుంది. ఎస్. జానకి అస్తమయం ఒక మహాగాన యుగానికి ముగింపు అయినా, ఆమె గాన వారసత్వం మాత్రం శాశ్వతంగా వెలుగొందే ధ్రువతారగానే నిలుస్తుంది. (వివరాలు సినిమాలో..)



# రక్తానికి రక్తం

• పగ తీర్చుకుంటాం • ట్రంప్‌కు వార్నింగ్
• మొజ్తబా హెచ్చరిక

ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ అంత్యక్రియల సందర్భంగా ఆయన కుమారుడు, ప్రస్తుత సుప్రీం నాయకుడు మొజ్తబా ఖమేనీ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తన తండ్రి రక్తానికి తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రకటించారు. యుద్ధంలో మరణించిన వారందరికీ న్యాయం జరిగే వరకు ఇరాన్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. (వివరాలు 3లో..)

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా తెలంగాణ

▪ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కారిడార్
▪ 7 బుల్లెట్ ట్రైన్లలో 3 తెలంగాణకే
▪ రైల్వే రంగంలో కొత్త శకం: అశ్వినీ వైష్ణవ్

రైల్వే రంగంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారబోతోందని వెల్లడించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'వికసిత్ భారత్-2047: సాంకేతికత పాత్ర' సదస్సులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన, రాష్ట్రానికి రైల్వే రంగంలో భారీ పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో రైల్వే మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.



2లో..




# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా తెలంగాణ

- హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కారిడార్
- 7 బుల్లెట్ ట్రైన్లలో 3 తెలంగాణకే
- రైల్వే రంగంలో కొత్త శకం: అశ్వినీ వైష్ణవ్

**మూడు బుల్లెట్ ట్రైన్లు తెలంగాణకే**

దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లలో మూడు తెలంగాణకు రావడం రాష్ట్రానికి గర్వకారణమని అశ్వినీ వైష్ణవ్ అన్నారు. హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరు నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ కారిడార్లు రూపుదిద్దుకోనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటా పది నిమిషాల్లో, ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాల్లో, చెన్నైకి రెండు గంటల్లో చేరుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టులు దేశ రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తాయని చెప్పారు.

**• రైల్వే బడ్జెట్‌లో భారీ పెరుగుదల**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గతంలో కేవలం రూ.880 కోట్ల రైల్వే బడ్జెట్ మాత్రమే లభించేదని, ప్రస్తుతం తెలంగాణకే రూ.5 వేల కోట్లకు పైగా నిధులు కేటాయిస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

**• స్టేషన్ల ఆధునికీకరణ వేగవంతం**

దేశవ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించే కార్యక్రమం కొనసాగుతోందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇప్పటికే 260 స్టేషన్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని వివరించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా స్టేషన్ల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలిపారు.

**• వందే భారత్ సేవలకు మరింత విస్తరణ**

తెలంగాణలో ఇప్పటికే ఐదు వందే భారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. త్వరలో మరిన్ని వందే భారత్ సేవలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించిన ఈ రైళ్లు ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా గత 12 ఏళ్లలో 36 వేల కిలోమీటర్లకు పైగా కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని గుర్తు చేశారు.

**• వికసిత్ భారత్ లక్ష్యానికి రైల్వే బలం**

దేశ రైల్వే నెట్‌వర్క్‌లో 99.4 శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిందన్నారు. 2,700 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కూడా పూర్తయిందని చెప్పారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో ఆధునిక రైల్వే వ్యవస్థ, సాంకేతికత కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణకు లభిస్తున్న బుల్లెట్ ట్రైన్లు, వందే భారత్ సేవలు, స్టేషన్ల ఆధునికీకరణ రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

# షాబాద్‌లో రక్తపాతం..

- సైకో కిరాతకం కలకలం
- అర్ధరాత్రి అమానుషం
- ఆరుగురి హత్యతో ఉలిక్కిపడ్డ తెలంగాణ



రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పోక్సో కేసులో ఇటీవలే బెయిల్‌పై విడుదలైన ఓ వ్యక్తి ఏకంగా ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. దైవాలగూడ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. కక్షతో రెచ్చిపోయిన నిందితుడు రాజ్‌కుమార్ కత్తితో మారణహోమం సృష్టించి అనంతరం పరారయ్యాడు. ఒకే రాత్రిలో ఆరు ప్రాణాలు కోల్పోవడం గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది.

**పోక్సో కేసుపై కక్షతో ఘాతుకం**

పోలీసుల వివరాల ప్రకారం, తనపై పోక్సో కేసు నమోదు చేయించారని భావించిన రాజ్‌కుమార్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. మొదట మైనర్ బాలిక ఇంటికి వెళ్లి ఆమెను బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అడ్డుకున్న బాలిక తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం బాలికను సమీపంలోని చెరువు ప్రాంతానికి తీసుకెళ్లి దారుణంగా చంపాడు. ఈ వరుస హత్యలు గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి.

**భార్యా పిల్లలను కూడా వదల్లేదు**

అక్కడితో ఆగని రాజ్‌కుమార్ తన ఇంటికి వెళ్లి భార్య సరితతో పాటు నాలుగేళ్ల కుమారుడు పరీక్షిత్, రెండేళ్ల కుమారుడు దైవీక్షిత్‌లను కూడా అత్యంత దారుణంగా హత్య చేశాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను, కన్నబిడ్డలను కూడా చంపడం అతని క్రూర మనస్తత్వానికి నిదర్శనంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

**తండ్రికి ఫోన్ చేసి నేరం ఒప్పుకున్న నిందితుడు**

ఆరుగురిని హత్య చేసిన తర్వాత రాజ్‌కుమార్ తన తండ్రి అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేసి నేరాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం. "ఆరుగురిని చంపేశాను... నేను కూడా చనిపోతున్నాను" అని చెప్పడంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

**ఏడు ప్రత్యేక బృందాలతో గాలింపు**

నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉండటంతో పోలీసులు భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తం ఏడు ప్రత్యేక బృందాలు అతని కోసం అన్వేషిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పోక్సో కేసులో అరెస్టై ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చిన రాజ్‌కుమార్ ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అతడిని వీలైనంత త్వరగా అరెస్టు చేసి చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.

**నిందితుడిని పట్టుకోవాలంటూ ఆందోళన**

ఈ ఘటనతో షాబాద్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఆలస్యం చేస్తే మరిన్ని ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంతో పాటు మరో కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసిన ఈ కిరాతక ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తుండగా, గ్రామ ప్రజలు భయాందోళనల మధ్య గడుపుతున్నారు.

# సీసీటీవీలో సైకో కిరాతకం

**ఆరుగురిని చంపిన నరరూప రాక్షసుడు**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురి హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ అనే నిందితుడు మైనర్ బాలికను బలవంతంగా ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బాలికను అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఆమె తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో హత్య చేసిన నిందితుడు, అనంతరం బాలికను చెరువు సమీపానికి తీసుకెళ్లి దారుణంగా చంపినట్లు పోలీసులు తెలిపారు. అక్కడితో ఆగకుండా తన ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్, భార్య సరితతో పాటు ఇద్దరు చిన్నారులను కూడా హత్య చేశాడు. అనంతరం తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని చంపినట్లు చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ దారుణ ఘటనకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# టార్గెట్ ఈటల

- కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు
- మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్‌ఏ ఆదేశాలు
- గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం
- గేట్లు మూస్తే ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందని హెచ్చరిక
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటల వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటల
- కేంద్రంతో కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
- ఈటల, బీఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- కాళేశ్వరం గేట్ల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు.

**గేట్లు మూస్తేనే నీటిని ఎత్తిపోతలం**

ఎన్‌డిఎస్‌ఏ ఇచ్చిన నివేదిక ప్రకారమే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం మేడిగడ్డ గేట్లు ఎత్తి ఉంచాలని నిపుణుల కమిటీ ఆదేశించిందని చెప్పారు. గేట్లు మూసిన తర్వాతే కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుందని వివరించారు. ఇప్పుడు ప్రవహిస్తున్న నీటిని నేరుగా ఎత్తిపోసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. గేట్లు మూసేస్తే బ్యారేజ్ మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఎన్‌డిఎస్‌ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు.

**ఈటలకు బహిరంగ సవాల్**

జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి తీసుకొస్తే ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎన్‌డిఎస్‌ఏ పర్యవేక్షణలో నీటిని ఎత్తిపోసేందుకు కేంద్రం అనుమతిస్తే వెంటనే అమలు చేస్తామని తెలిపారు. అంతేకాదు, అవసరమైతే నిర్వహణ బాధ్యతలను ఈటల రాజేందర్ , బీఆర్ఎస్ నేతలకే అప్పగించడానికి కూడా సిద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజలను గందరగోళానికి గురిచేసే ప్రకటనలు చేయకుండా వాస్తవాలతో మాట్లాడాలని సూచించారు.

**హరీశ్ సూచనలతోనే ఈటల మాటలు?**

ఈటల రాజేందర్ చేస్తున్న వ్యాఖ్యల వెనుక మాజీ మంత్రి హరీశ్ రావు సూచనలు ఉన్నాయని సీఎం ఆరోపించారు. ఈటలపై తమకు వ్యక్తిగత గౌరవం ఉందని చెప్పినా, తాజా వ్యాఖ్యలతో ఆయన తన గౌరవాన్ని తానే తగ్గించుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం కాళేశ్వరం అంశాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. పట్టిసీమకు నీరు వదులుతున్నారన్న ప్రచారం కూడా పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు.

**లోపాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే**

కాళేశ్వరం ప్రాజెక్టులోని లోపాలు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత బయటపడలేదని సీఎం వివరించారు. 2019లో ప్రాజెక్టు ప్రారంభమైన కొద్ది నెలల్లోనే మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణ లోపాలు గుర్తించారని తెలిపారు. 2020లోనే ఇంజినీర్లు ప్రభుత్వానికి హెచ్చరికలు పంపారని గుర్తు చేశారు. ఆ సూచనలను పట్టించుకోకపోవడం వల్ల సమస్యలు మరింత పెరిగాయని చెప్పారు. 2022లో వరదల కారణంగా కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని, ఇప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని వెల్లడించారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందని పేర్కొన్నారు.

**ఎన్‌డిఎస్‌ఏ నివేదికే ప్రభుత్వానికి ఆధారం**

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు పూర్తిగా అనుకూలంగా లేవని ఎన్‌డిఎస్‌ఏ ప్రాథమిక నివేదికతో పాటు తుది నివేదికలో కూడా స్పష్టం చేసిందని సీఎం గుర్తుచేశారు. ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో లోపాలు ఉన్నాయని నిపుణులు అప్పుడే హెచ్చరించారని తెలిపారు. ఆ సూచనలను అమలు చేయకపోవడం వల్లే ప్రాజెక్టు నేటి పరిస్థితికి చేరిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం కాకుండా వాస్తవాలను అంగీకరించాలని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# వాళ్లూ వీళ్లూ ఎందుకు..

- నేనే బరిలో దిగుతా..
- హరీశ్‌పై పోటీకి సై అన్న జగ్గారెడ్డి
- సిద్దిపేటలో కొత్త సమీకరణం



సిద్దిపేట రాజకీయాలు మరోసారి హీట్ ఎక్కుతున్నాయి. హరీశ్‌రావు కంచుకోటగా పేరొందిన ఈ నియోజకవర్గంపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి చేసిన సవాల్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. "వాళ్లు.. వీళ్లు ఎందుకు? పార్టీ ఆదేశిస్తే నేనే బరిలో దిగుతా" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. వ్యక్తిగత లెక్కలు కాదని, పార్టీ నిర్ణయమే తన నిర్ణయమని స్పష్టం చేయడం ఈ ప్రకటనకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. ఒకవైపు హరీశ్‌రావు బలమైన నాయకత్వం, మరోవైపు కాంగ్రెస్ దూకుడు కలిసివచ్చిన వేళ సిద్దిపేటలో పోటీపై ఇప్పటి నుంచే రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

తెలంగాణ రాజకీయాల్లో సిద్దిపేట నియోజకవర్గం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావుపై పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత ఇష్టాల కంటే పార్టీ నిర్ణయమే ముఖ్యమని తేల్చిచెప్పారు. అధిష్టానం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడే బరిలోకి దిగుతానని ప్రకటించారు.

**వేటగాడి వ్యూహంలో పెద్దపులి కూడా**

తన రాజకీయ ప్రయాణాన్ని ఉదాహరణగా చెబుతూ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎంత పెద్ద నాయకుడైనా రాజకీయ వ్యూహాలకు లోబడాల్సిందేనన్నారు. "ఎంత పెద్దపులి అయినా వేటగాడి వ్యూహంలో పడాల్సిందే. ఎన్నికల రాజకీయాలు కూడా అలాగే ఉంటాయి" అని వ్యాఖ్యానించారు. అందుకే గతంలో తాను రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయానని గుర్తుచేశారు. రాజకీయాల్లో కౌంటర్, ఎన్‌కౌంటర్ సహజమని పేర్కొన్నారు.

**సంగారెడ్డిపై మారిన వైఖరి**

ఒకప్పుడు సంగారెడ్డి నుంచి పోటీ చేయనని ప్రకటించిన జగ్గారెడ్డి ఇప్పుడు తన వైఖరిని మార్చినట్లు సంకేతాలు ఇచ్చారు. భవిష్యత్తులో నియోజకవర్గం మహిళా రిజర్వేషన్‌కు వెళ్తే తన భార్య నిర్మల జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని చెప్పారు. తాను మాత్రం పార్టీ అవసరాన్ని బట్టి మరో నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని వెల్లడించారు. దీంతో కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలపై చర్చ మొదలైంది.

**సిద్దిపేటపై పెరిగిన రాజకీయ వేడి**

జగ్గారెడ్డి వ్యాఖ్యలతో సిద్దిపేట నియోజకవర్గం రాజకీయంగా మరింత హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ నేత కవిత కూడా సిద్దిపేట నుంచి పోటీ చేసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు జగ్గారెడ్డి కూడా అదే నియోజకవర్గంపై ఆసక్తి చూపడంతో హరీశ్‌రావుకు బలమైన సవాలు ఎదురయ్యే అవకాశంపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ సిద్దిపేట పోరు ఇప్పటి నుంచే రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది.

# వియత్నాం విషాదం

- అలలలో కలిసిన ప్రాణాలు
- విహార యాత్రలో ఘోర ప్రమాదం
- పర్యాటకుల కలల యాత్ర కన్నీటి గాథ

విహారయాత్ర కోసం వియత్నాం వెళ్లిన భారతీయులకు ఊహించని విషాదం ఎదురైంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో ప్రయాణిస్తున్న స్పీడ్‌బోట్ బోల్తా పడటంతో కనీసం 15 మంది భారతీయ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. బోటులో మొత్తం 32 మంది పర్యాటకులు, నలుగురు సిబ్బంది ప్రయాణిస్తున్నారు. హోన్ మే రుట్ ప్రాంతం నుంచి ఆన్ థోయ్ పోర్టుకు వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. క్షణాల్లో బోటు సముద్రంలో మునిగిపోవడంతో అందరూ అలల మధ్య చిక్కుకుపోయారు.

**అలల ఉద్ధృతితో మునిగిన బోటు**

ప్రమాదం జరిగిన సమయంలో సముద్రంలో భారీ అలలు ఎగిసిపడుతున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. హోన్ మే రుట్ స్గోయి తీరానికి సుమారు 400 మీటర్ల దూరంలో స్పీడ్‌బోట్ అదుపు తప్పి బోల్తా పడింది. బోటు ఒక్కసారిగా మునిగిపోవడంతో ప్రయాణికులు సముద్రంలోకి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించాయి. పలువురిని రక్షించినప్పటికీ, మరికొందరి కోసం అన్వేషణ కొనసాగుతోంది.

**లావా సంస్థ ఉద్యోగుల యాత్ర**

ప్రమాదం తర్వాత హనోయిలోని భారత రాయబార కార్యాలయం వెంటనే స్పందించింది. బాధితుల కుటుంబాలకు సమాచారం అందించేందుకు హనోయి రాయబార కార్యాలయం, హోచిమిన్ నగరంలోని భారత కాన్సులేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. సహాయక చర్యలను స్థానిక అధికారులతో కలిసి సమన్వయం చేస్తోంది. బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని భారత అధికారులు ప్రకటించారు. ఈ ప్రమాదంలో ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ లావాకు చెందిన ఉద్యోగులు, డిస్ట్రిబ్యూటర్లు కూడా ఉన్నట్లు సమాచారం. సంస్థ విడుదల చేసిన ప్రకటనలో బాధితుల్లో తమ బృంద సభ్యులు ఉన్నారని తెలిపింది. మొత్తం 110 మంది ఉద్యోగులు, డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం విహారయాత్రకు వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ప్రభావితమైన కుటుంబాలకు పూర్తి సహాయం అందిస్తామని సంస్థ హామీ ఇచ్చింది.

**ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు**

స్పీడ్‌బోట్ ఎందుకు బోల్తా పడిందనే విషయంపై వియత్నాం అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భారీ అలలు ప్రమాదానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. బోటులో సాంకేతిక లోపం కూడా ఉండి ఉండొచ్చన్న అనుమానాలను అధికారులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత ప్రమాదానికి అసలు కారణం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఆనందంగా ప్రారంభమైన విహారయాత్ర క్షణాల్లో విషాదయాత్రగా మారిపోయింది. కుటుంబ సభ్యులతో గడపాల్సిన మధుర క్షణాలు శోకసంద్రంగా మారాయి. విదేశీ పర్యటనకు వెళ్లిన అమాయక ప్రాణాలు సముద్ర అలల్లో కలిసిపోవడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.



# భారత్-కివీస్ బంధం బలోపేతం

- న్యూజిలాండ్‌తో వ్యూహాత్మక బంధం
- విజయవంతంగా ముగిసిన మోదీ టూర్




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల విదేశీ పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్‌లో రెండు రోజుల పర్యటన పూర్తి చేశారు. నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి న్యూజిలాండ్‌ను సందర్శించడం చారిత్రాత్మకంగా నిలిచింది. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ మోదీకి వీడ్కోలు పలికారు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయి.

**వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం**

మోదీ, లక్సన్ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో భారత్, న్యూజిలాండ్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.35 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సమావేశంలో మొత్తం 18 కీలక నిర్ణయాలు తీసుకోగా, 10 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రక్షణ, సముద్ర భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత విస్తరించేందుకు రోడ్‌మ్యాప్ రూపొందించారు.

**రక్షణ రంగంలో కీలక ఒప్పందాలు**

ఇండోపసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రతపై కలిసి పనిచేయాలని రెండు దేశాలు అంగీకరించాయి. భారత నౌకాదళం, న్యూజిలాండ్ రక్షణ దళాల మధ్య పరస్పర లాజిస్టిక్ సహకార ఒప్పందం కుదిరింది. ఉగ్రవాద నిరోధక చర్యలు, సైబర్ భద్రత, సమాచార మార్పిడి కోసం ప్రత్యేక సంయుక్త వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలకు కూడా ఉమ్మడి మద్దతు ప్రకటించారు.

**ప్రవాస భారతీయులకు మోదీ సందేశం**

ఆక్లాండ్‌లో జరిగిన ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీ భావోద్వేగ ప్రసంగం చేశారు. భారత్, న్యూజిలాండ్ సంబంధాలు పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై నిర్మితమయ్యాయని చెప్పారు. "వాకా" అనేది కేవలం పడవ కాదని, రెండు దేశాల ఉమ్మడి ప్రయాణానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, డిజిటల్ చెల్లింపులు, అంతరిక్ష సాంకేతికత, డ్రోన్ రంగాల్లో ప్రపంచానికి కొత్త మార్గం చూపుతోందని వివరించారు.

**భారత్‌పై లక్సన్ ప్రశంసలు**

న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ భారత్ అభివృద్ధిని ప్రశంసించారు. 21వ శతాబ్దాన్ని తీర్చిదిద్దే దేశంగా భారత్ ఎదుగుతోందని అన్నారు. గత పదేళ్లలో కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని, మౌలిక సదుపాయాలు, అంతరిక్ష పరిశోధన, ఆర్థిక వృద్ధిలో భారత్ సాధించిన పురోగతి ప్రపంచానికి ఆదర్శమని కొనియాడారు. నలభై ఏళ్ల తర్వాత భారత ప్రధాని తమ దేశానికి రావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.

**ఆర్థిక లక్ష్యాలకు కొత్త ఊపు**

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో రెండు దేశాల మధ్య పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, యువ పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని ఇరు దేశాల నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాపారం, సాంకేతికత, విద్య, క్రీడలు, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ పర్యటనతో భారత్‌న్యూజిలాండ్ సంబంధాలు కొత్త దిశగా పయనిస్తూ ఇండోపసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక సహకారానికి మరింత బలం చేకూరింది.



ఆంటీలపై పెరుగుతున్న మోజు..

# యువతలో వికృత క్రేజు

## వైరల్ ట్రెండా? విలువల మార్పా?

సమాజం ఎటు వైపు వెళుతోంది?

ప్రేమను ప్రేమించు... విలువలు మరువొద్దు!

ప్రేమకు హద్దుల్లేవ్.. బాధ్యతకు ప్రత్యామ్నాయం లేదు

**ఒకప్పుడు ప్రేమ అంటే రెండు హృదయాల కలయిక. ఇప్పుడు ప్రేమ అంటే కోట్ల వ్యూస్, లక్షల లైక్స్, వైరల్ రీల్స్. స్క్రీన్‌పై మొదలైన ఒక ట్రెండ్... నెమ్మదిగా సమాజం ఆలోచనలనే మార్చేస్తోంది. తమకంటే ఎక్కువ వయసు ఉన్న మహిళలతో యువకుల ప్రేమ కథలు నేడు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. కొందరికి అది ధైర్యమైన నిర్ణయం. మరికొందరికి అది విలువల పతనానికి సంకేతం. ప్రేమకు నిజంగానే వయసు అడ్డుకాదా? లేక మార్కెట్ సృష్టించిన కొత్త మోజునా? మనసులు కలవడం గొప్పదా? లేక సంచలనం కావడమే లక్ష్యమా? ప్రేమ పేరుతో మారుతున్న ఆలోచనలు... మారిపోతున్న కుటుంబ బంధాలు... ప్రశ్నలు వేస్తున్న భారతీయ విలువలు... ఈ చర్చలో సరైనది ఎవరు? తప్పు ఎవరు? తీర్పు చెప్పడం కాదు ఈ కథ ఉద్దేశం. వైరల్ ప్రపంచం వెనుక కనిపించని వాస్తవాలను... ప్రేమ అనే పదం కోల్పోతున్న అసలు అర్థాన్ని... మన సమాజం నడుస్తున్న దారిని ఒకసారి ఆగి ఆలోచించాల్సిన సమయం వచ్చిందని గుర్తు చేయడమే ఈ ప్రయాణం.**

ప్రేమకు వయసు అడ్డుకాదని చాలామంది చెబుతారు. మనసులు కలిస్తే చాలని మరికొందరు నమ్ముతారు. ఈ రెండు వాదనల్లోనూ కొంత నిజం ఉంది. కానీ నేటి డిజిటల్ ప్రపంచంలో ప్రేమ గురించి జరుగుతున్న చర్చలు సహజమైన భావోద్వేగాల కంటే సంచలనాల వైపే ఎక్కువగా పయనిస్తున్నాయి. ముఖ్యంగా తమకంటే ఎక్కువ వయసు ఉన్న మహిళలతో యువకుల ప్రేమ, రొమాన్స్, అనుబంధాలను కేంద్రంగా చేసుకుని రూపొందుతున్న వీడియోలు, వెబ్‌సిరీస్‌లు, రీల్స్, షార్ట్ వీడియోలు కోట్లాది వ్యూస్ సాధిస్తున్నాయి. "ఏజ్ ఈజ్ జస్ట్ ఏ నంబర్", "మెచ్యూరిటీ ఈజ్ ది న్యూ రొమాన్స్" వంటి నినాదాలు కొత్త తరం ఆలోచనలకు ఆకర్షణగా మారుతున్నాయి. దీంతో ఒక ప్రశ్న సమాజం ముందు నిలుస్తోంది. ఇది నిజంగా విలువల పరిణామమా? లేక వినోద పరిశ్రమ మార్కెట్ కోసం సృష్టించిన కొత్త ట్రెండా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా కేవలం వైరల్ అవుతున్నదే నిజమని నమ్మడం ప్రమాదకరం.

### వ్యక్తిగత స్వేచ్ఛకు సామాజిక బాధ్యత తోడుండాలి

చట్టబద్ధంగా పెద్దవారైన ఇద్దరు వ్యక్తులు పరస్పర సమ్మతితో ఏర్పరుచుకునే సంబంధం వారి వ్యక్తిగత హక్కు. ఆ హక్కును ఎవరూ ప్రశ్నించలేరు. ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా అదే చెబుతుంది. కానీ వ్యక్తిగత నిర్ణయాన్ని సమాజానికి ఆదర్శంగా ప్రచారం చేయడం మరో విషయం. నేడు సోషల్ మీడియా అల్గోరిథమ్‌లు భావోద్వేగాలకంటే సంచలనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. అందుకే అసాధారణమైన సంబంధాలు వేగంగా వైరల్ అవుతున్నాయి. ఫలితంగా అవే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కనిపిస్తున్నాయనే కారణంతో అవే ఎక్కువగా జరుగుతున్నాయనే భావన కూడా ఏర్పడుతోంది. ఇదే ప్రమాదకరమైన మానసిక ప్రభావం. ఒక వ్యక్తి తీసుకున్న నిర్ణయం అతని జీవితానికే పరిమితం కావచ్చు. కానీ అదే నిర్ణయాన్ని ట్రెండ్‌గా మార్చినప్పుడు వేలాది మంది యువత దాన్ని అనుకరించే అవకాశమూ ఉంటుంది. అందుకే వ్యక్తిగత స్వేచ్ఛకు సమాజంపై ఉన్న బాధ్యతను వేరు చేయాల్సిన అవసరం ఉంది.

### సంచలన కథలు నిజజీవితాన్ని ప్రతిబింబించవు

ఎప్పుడూ ఒకప్పుడు ప్రేమ కథలు నమ్మకం, త్యాగం, కుటుంబం, బాధ్యత చుట్టూ తిరిగేవి. ఇప్పుడు చాలా కథల్లో నిషేధాన్ని దాటడం, వయసు వ్యత్యాసాన్ని సంచలనంగా చూపించడం, రహస్య సంబంధాలను ఉత్కంఠగా చిత్రీకరించడం ప్రధాన అంశాలుగా మారాయి. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడమే లక్ష్యంగా కథలు రూపొందుతున్నాయి. వ్యూస్ పెరగాలి, లైక్స్ రావాలి, చర్చ జరగాలి అనే ఆలోచనతో భావోద్వేగాలను కూడా వ్యాపార వస్తువులుగా మార్చుతున్నారు. దీంతో యువతలో ఒక అపోహ పెరుగుతోంది. అసాధారణ సంబంధాలే గొప్పవన్న భావన పెరిగే ప్రమాదం ఉంది. కానీ నిజ జీవితంలో ఎక్కువ మంది నిర్మించేది సాధారణ కుటుంబాలే. సమాజాన్ని ముందుకు నడిపేది ప్రతిరోజూ వైరల్ అయ్యే కథలు కాదు. నిశ్శబ్దంగా బాధ్యతలు పంచుకునే దాంపత్యాలు, ఒకరినొకరు గౌరవించే కుటుంబాలే.

### సంబంధాల రూపాన్ని మార్చేసిన డిజిటల్ ప్రపంచం

మనోవిజ్ఞాన నిపుణులు చెప్పే ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రతి వయసు వ్యత్యాసం ఉన్న సంబంధానికి ఒకే కారణం ఉండదు. కొందరికి భావోద్వేగ పరిపక్వత ఆకర్షణగా అనిపించవచ్చు. మరికొందరికి జీవిత అనుభవం భరోసాగా అనిపించవచ్చు. ఒంటరితనం నుంచి బయటపడాలనే కోరిక కూడా కారణం కావచ్చు. తమను విమర్శించకుండా వినే వ్యక్తి కోసం వెతుకుతుండవచ్చు. అందుకే అన్ని సంబంధాలను ఒకే కొలమానంతో తప్పుబట్టడం సరైంది కాదు. అదే సమయంలో ప్రతి వైరల్ వీడియో వెనుక ఉన్న కథ పూర్తిగా నిజమేనని నమ్మడం కూడా సరైంది కాదు. కెమెరా ముందు కనిపించేది కథలోని చిన్న భాగమే. దాగి ఉన్న భావోద్వేగాలు, కుటుంబ సమస్యలు, భవిష్యత్తు సవాళ్లు, మానసిక ఒత్తిడులు చాలా సందర్భాల్లో బయటకు రావు. ఒకప్పుడు పరిచయాలు కుటుంబం, బంధువులు, విద్యాసంస్థలు, ఉద్యోగం ద్వారా ఏర్పడేవి. ఇప్పుడు ఒక్క మొబైల్ ఫోన్ ప్రపంచాన్ని చేతిలోకి తెచ్చింది. పరిచయం ఏర్పడటానికి నిమిషాలు చాలు. కానీ నమ్మకం ఏర్పడటానికి ఇంకా సమయమే కావాలి. సోషల్ మీడియాలో కనిపించే చిరునవ్వు నిజమైన ఆనందానికి హామీ కాదు. ఫోటోలో కనిపించే ప్రేమ నిజ జీవితంలో అదే స్థాయిలో ఉండాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ చాలా మంది యువత సోషల్ మీడియాను జీవిత ప్రమాణంగా తీసుకుంటున్నారు. ఇతరుల జీవితాలను చూసి తమ జీవితాన్ని కొలవడం ప్రారంభిస్తున్నారు. దీనివల్ల అసంతృప్తి, పోలికలు, ఒత్తిడి పెరుగుతున్నాయి. ప్రేమ అనేది ప్రదర్శన కాదు. అది ఇద్దరి మధ్య నిశ్శబ్దంగా పెరిగే నమ్మకం. ఆ నమ్మకాన్ని ఫాలోవర్ల సంఖ్యతో కొలవలేం.

### ఆకర్షణ క్షణికం... ప్రేమ శాశ్వతమైన బంధం

భారతీయ సంస్కృతి ప్రేమను ఎప్పుడూ వ్యతిరేకించలేదు. ప్రేమను పవిత్రమైన అనుబంధంగా చూసింది. దాంపత్యాన్ని కుటుంబ నిర్మాణానికి మూలంగా భావించింది. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాల్లో కామానికీ స్థానం కల్పించింది. అయితే కోరికకు బాధ్యతను జోడించింది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన "ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి" అనే సందేశం కూడా అదే చెబుతుంది. ధర్మానికి విరుద్ధం కాని కోరికలో దైవత్వం ఉందని స్పష్టం చేస్తుంది. అంటే ప్రేమను తిరస్కరించలేదు. కానీ ప్రేమకు బాధ్యత, గౌరవం, నైతికత అవసరమని బోధించింది. అందుకే భారతీయ ఆలోచనలో ప్రేమ అనేది కేవలం ఆకర్షణ కాదు. జీవితాంతం నిలిచే నిబద్ధత.

### ప్రేమ, ఆకర్షణ, రొమాన్స్, అనుబంధం ఒకే అర్థం

ఇచ్చే పదాలు కావు. ఆకర్షణ కొన్ని క్షణాల్లో కలగొచ్చు. రొమాన్స్ ప్రేమను వ్యక్తపరిచే ఒక రూపం మాత్రమే. కానీ ప్రేమ అనేది కాలపరీక్షను తట్టుకునే విశ్వాసం. కష్టకాలంలో విడిచిపెట్టకుండా నిలబడే ధైర్యం. విజయాన్ని కలిసి ఆనందించడం మాత్రమే కాదు. అపజయాన్ని కూడా కలిసి భరించడం. నేటి డిజిటల్ సంస్కృతిలో ప్రేమను ఎక్కువగా వినోదంగా చూపిస్తున్నారు. కానీ నిజ జీవితంలో ప్రేమ అంటే బాధ్యత. ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడుకోవడం. వ్యక్తిత్వాన్ని అంగీకరించడం. తప్పులను సరిదిద్దుకోవడం. సంబంధాన్ని నిలబెట్టేందుకు ఇద్దరూ కృషి చేయడం. ఇవే నిజమైన ప్రేమకు పునాది.

### ఆరోగ్యకరమైన బంధాలకు ఐదు మూల సూత్రాలు

భారతీయ సమాజంలో కుటుంబం కేవలం రక్తసంబంధం కాదు. అది విలువల పాఠశాల. ఒక సంబంధం ఇద్దరు వ్యక్తుల మధ్య మాత్రమే ఉండదు. దాని ప్రభావం తల్లిదండ్రులు, పిల్లలు, బంధువులు, సమాజంపై కూడా పడుతుంది. అందుకే ప్రతి నిర్ణయంలో స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉండాలి. స్వేచ్ఛ అంటే నియంత్రణ లేకపోవడం కాదు. మన నిర్ణయం ఇతరుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో ఆలోచించడం పరిపక్వత. కుటుంబ వ్యవస్థ బలహీనపడితే సమాజం కూడా బలహీనపడుతుంది. వైరల్ ట్రెండ్‌లు కొన్ని రోజులు మాత్రమే ఉంటాయి. కానీ కుటుంబ విలువలు తరాల పాటు నిలుస్తాయి. మానసిక ఆరోగ్య నిపుణులు ఆరోగ్యకరమైన సంబంధానికి ఐదు ప్రధాన విలువలను సూచిస్తున్నారు. పరస్పర గౌరవం, స్పష్టమైన సమ్మతి, నిజాయితీ, సంభాషణ, వ్యక్తిగత హద్దులకు గౌరవం. ఈ ఐదు అంశాలు ఉన్నప్పుడు మాత్రమే ఏ సంబంధమైనా బలపడుతుంది. వయసు, అందం, ఆర్థిక స్థితి, సామాజిక గుర్తింపు ఇవన్నీ రెండో స్థానంలో ఉంటాయి. గౌరవం లేని ప్రేమ ఎక్కువకాలం నిలవదు. సంభాషణ లేని బంధం అపోహలకు దారి తీస్తుంది. నిజాయితీ లేని అనుబంధం నమ్మకాన్ని కోల్పోతుంది. కాబట్టి బంధం నిలబడేది భావోద్వేగాల వల్ల మాత్రమే కాదు. విలువల వల్ల కూడా.

### యువతకు మార్గనిర్దేశం చేయాల్సిన సమయం వచ్చింది

ప్రేమ గురించి మాట్లాడకపోవడం వల్ల సమస్యలు తగ్గవు. తల్లిదండ్రులు పిల్లలతో సంభాషించాలి. విద్యాసంస్థలు భావోద్వేగ పరిపక్వత, పరస్పర గౌరవం, లింగ సమానత్వం, ఆరోగ్యకరమైన సంబంధాలపై అవగాహన కల్పించాలి. సోషల్ మీడియా ఇచ్చే సమాచారమే జీవిత సత్యం కాదని యువతకు చెప్పాలి. ప్రేమను నిషేధంగా కాకుండా బాధ్యతగా అర్థం చేసుకునే వాతావరణం అవసరం. చివరికి "ఆంటీలతో ప్రేమ" వంటి అంశాలు సోషల్ మీడియాలో ఎంత వైరల్ అయినా అవే సమాజానికి ప్రతిబింబం కావు. ట్రెండ్‌లు వస్తాయి. మారిపోతాయి. కానీ గౌరవం, బాధ్యత, నిజాయితీ, మానవత్వం వంటి విలువలు ఎప్పటికీ శాశ్వతం. ప్రేమను ప్రేమించాలి. కానీ ప్రేమ పేరుతో విలువలను కోల్పోవద్దు. ఎందుకంటే సమాజాన్ని నిలబెట్టేది సంచలన కథలు కాదు. మనుషుల మధ్య నిలిచిపోయే విశ్వాసం. కుటుంబాలను కాపాడేది వైరల్ వీడియోలు కాదు. పరస్పర బాధ్యతతో జీవించే బంధాలు. ప్రేమకు మానవత్వం తోడైతేనే అది వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించే శక్తిగా మారుతుంది.

### ప్రేమకు విలువలు తోడైతేనే భవిష్యత్తు సురక్షితం

ప్రేమను ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ ప్రేమ పేరుతో ప్రతి ట్రెండ్‌ను అంగీకరించడం కూడా తెలివైన నిర్ణయం కాదు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి బంధం ఆదర్శం కాదు. ప్రతి వైరల్ వీడియో వెనుక కనిపించని భావోద్వేగ గాయాలు, కుటుంబాల వేదనలు, మానసిక ఒత్తిడులు, భవిష్యత్తు సమస్యలు కూడా ఉండొచ్చు. క్షణిక ఆకర్షణను జీవిత నిర్ణయంగా మార్చడం ప్రమాదకరం. వ్యూస్ కోసం సృష్టించిన కథలను నిజ జీవితానికి ప్రమాణాలుగా తీసుకోవడం మరింత ప్రమాదకరం. పరస్పర గౌరవం, సమ్మతి, బాధ్యత, నిజాయితీ లేని ఏ బంధమైనా ఒక దశలో విరిగిపోతుంది. వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు పరిణామాలపై అవగాహన కూడా ఉండాలి. ముఖ్యంగా యువత భావోద్వేగాల కంటే వివేకానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రేమ జీవితాన్ని నిర్మించాలి గానీ, జీవితాన్నే పణంగా పెట్టే మోహంగా మారకూడదు. ట్రెండ్‌లు మారిపోతాయి. వైరల్ పోస్టులు మరచిపోతారు. కానీ ఒక తప్పు నిర్ణయం మిగిల్చే గాయం జీవితాంతం వెంటాడే అవకాశం ఉంది. అందుకే ప్రేమను గుండెతో స్వీకరించండి... నిర్ణయాలను మాత్రం బుద్ధితో తీసుకోండి.

### వైరల్ ట్రెండ్‌ను జీవిత సత్యంగా నమ్మకండి,

ఎందుకంటే సోషల్ మీడియాలో కనిపించేది మొత్తం నిజం కాదు. క్షణిక ఆకర్షణను శాశ్వత ప్రేమగా భావించడం ప్రమాదకరం, భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం జీవితాంతం బాధగా మారే అవకాశం ఉంది. వ్యక్తిగత స్వేచ్ఛకు బాధ్యత కూడా తోడుండాలి. ఎందుకంటే మీ నిర్ణయం కుటుంబాలను, పిల్లలను, భవిష్యత్తును ప్రభావితం చేయగలదు. లైక్స్, వ్యూస్, ఫాలోవర్లు ప్రేమకు కొలమానం కావు; నిజమైన బంధాన్ని సోషల్ మీడియా గుర్తించదు, కాలమే గుర్తిస్తుంది. సమ్మతి, గౌరవం, నిజాయితీ లేని బంధం ప్రమాద ఘంటికలా మారుతుంది, అలాంటి సంబంధాలు మానసిక గాయాలను మిగిల్చే అవకాశం ఎక్కువ. మార్కెట్ అమ్మేది సంచలనం మాత్రమే, కానీ జీవితాన్ని నిలబెట్టేది విలువలు, నమ్మకం, కుటుంబ బలం. ట్రెండ్‌లు మారిపోతాయి కానీ నిర్ణయాల పరిణామాలు మారవు... ఒక్క తప్పు అడుగు జీవితాన్ని పూర్తిగా మార్చేయగలదు. గుర్తుంచుకోండి.. ప్రేమ అందమైనది కానీ వివేకం లేని ప్రేమ ప్రమాదకరం..


*– హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్*

### ప్రేమ నిలవాలంటే త్రి సూత్రాలు పాటించాల్సిందే!

నిజమైన ప్రేమకు సాన్నిహిత్యం, నిబద్ధత, అనురాగం అనే మూడు అంశాలు అవసరం.. ప్రేమ అనేది సహజమైన మానవ భావోద్వేగం. దానికి వయసు ఒక్కటే ప్రమాణం కాదు. అయితే ప్రతి సంబంధం ఆరోగ్యకరమైందే అని కూడా చెప్పలేం. సంబంధంలో పరస్పర గౌరవం చాలా ముఖ్యం. స్పష్టమైన సమ్మతి కూడా తప్పనిసరి. నిజాయితీ, బాధ్యత లేకుంటే ప్రేమ నిలవదు. సోషల్ మీడియాలో కనిపించేది మొత్తం నిజజీవితం కాదు. వైరల్ కావడం వల్ల ఒక విషయం సరైనదైపోదు. యువత ట్రెండ్‌లను జీవిత ప్రమాణాలుగా తీసుకోకూడదు. ఆకర్షణను ప్రేమగా పొరబడే అవకాశం ఉంటుంది. ప్రతి పెద్ద నిర్ణయం ప్రశాంతంగా ఆలోచించి తీసుకోవాలి. భావోద్వేగాల కంటే వివేకం కూడా అవసరం. అవసరమైతే కుటుంబ సభ్యులతో మాట్లాడటం మంచిది. నమ్మకమైన పెద్దల సలహా తీసుకోవడం ఉపయోగకరం. సంబంధం భవిష్యత్తుపై కూడా ఆలోచించాలి. క్షణిక ఆనందం కంటే దీర్ఘకాల శ్రేయస్సు ముఖ్యం. పోలికలు, లైక్స్, వ్యూస్ జీవితాన్ని నిర్ణయించవు. మన విలువలు మనకు దిక్సూచిగా ఉండాలి. ప్రేమ ఎవరికీ హాని కలిగించకూడదు. మనసుకు శాంతిని ఇచ్చే బంధమే మంచి బంధం. భయం, ఒత్తిడి, మోసం ఉన్న చోట ప్రేమ బలహీనమవుతుంది. స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉండాలి. వ్యక్తిగత నిర్ణయాలకు సామాజిక ప్రభావం కూడా ఉంటుంది. అందుకే తొందరపాటు నిర్ణయాలు తీసుకోకండి. ఒక వైరల్ వీడియో కోసం జీవితాన్ని మార్చుకోవద్దు. నిజమైన ప్రేమ కాల పరీక్షను తట్టుకుంటుంది. మంచి సంబంధం ఇద్దరినీ ఎదగనిస్తుంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్త రాబర్ట్ స్టెర్న్ బర్గ్ ప్రతిపాదించిన "ట్రయాంగులర్ థియరీ ఆఫ్ లవ్" ప్రకారం నిజమైన ప్రేమకు సాన్నిహిత్యం, నిబద్ధత, అనురాగం అనే మూడు అంశాలు అవసరం. ఈ మూడు లేకపోతే బంధం ఎక్కువ కాలం నిలవడం కష్టం. ప్రేమను హృదయంతో స్వీకరించండి. జీవిత నిర్ణయాలను మాత్రం వివేకంతో తీసుకోండి.



డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి
కన్సల్టెంట్ సైకాలజిస్ట్,
ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు



# మస్క్ పంచాంగం

# అయోమయంలో ఐటీ రంగం

- కల నెరవేరుతుందా?
- అగ్రరాజ్య పీఠంపై ఎలోన్ మస్క్!
- వైట్ హౌస్ రేసులో వ్యాపార దిగ్గజం

## బూస్టింగా... బూమరాంగా?



రాజకీయాల్లో కొన్నిసార్లు మనం అనుకున్నవి అనుకున్నట్లు జరగవు అని పదేపదే చెప్పుకుంటూ ఉంటాం. అయితే ప్రపంచాన్ని శాసించే అమెరికా అగ్రరాజ్యంలో కూడా ఒక పెద్ద మనిషి వైట్ హౌస్ పీఠాన్ని అధిరోహించాలని... అమెరికా అధ్యక్షుడు అవ్వాలని కలలు కంటున్నాడు. ఆయన అమెరికా అధ్యక్షుడు అవుతాడా లేదా అనే విషయాన్ని పక్కన పెడితే, ఆయన మూలాలు అమెరికాలో లేకపోయినా తాను అమెరికన్‌గా గర్వంగా తలెత్తుకుని తిరుగుతుంటారు. అమెరికా అంటే తనకు ఎంతో గర్వమని, ఈ ప్రపంచాన్ని మార్చాలన్నదే తన ముఖ్య ఉద్దేశమని ఆ ప్రముఖ వ్యాపారవేత్త ప్రతిసారి చెబుతూ ఉంటారు. తాజాగా ఆయన చెప్తున్న కొన్ని ఆసక్తికరమైన అంశాలను గమనిస్తే, భవిష్యత్తులో జరగబోతున్న అనేక రాజకీయ పరిణామాల గురించి ఆయన ఇచ్చే సంకేతాలు మనందరినీ ఆశ్చర్యానికి, తీవ్ర ఆలోచనకు గురిచేస్తున్నాయి.

**మస్క్ రాజకీయం:** ట్రంప్‌తో వైరం నుండి దోస్తీ వరకు అమెరికాలో గత ఎన్నికల సమయంలో రిపబ్లికన్ల తరపున ఒక కీలకమైన వ్యక్తిగా పనిచేసిన ఎలోన్ మస్క్, ఆ తర్వాత డోనాల్డ్ ట్రంప్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల తొలగింపు ప్రక్రియలో భాగమయ్యారు. ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచేలా ఒక ప్రత్యేక విభాగానికి నాయకత్వం వహించి, అమెరికా ప్రభుత్వ రంగంలో చాలా మంది ఉద్యోగాలు కోల్పోవడానికి కారణమయ్యారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున వివాదాలు తలెత్తడం, ఆయన పదవి కోల్పోవడం, ట్రంప్‌తో తీవ్రమైన పేచీ పెట్టుకోవడం వంటి పరిణామాలు మన కళ్లముందే జరిగాయి. అయితే రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే చందంగా ఆ తర్వాత ట్రంప్, మస్క్ ఇద్దరూ రాజీపడటం అందరం చూశాం. ఎప్పటికైనా సరే అమెరికాను ప్రపంచంలోనే ఒక అగ్రగామి దేశంగా తిరిగి నిలబెట్టాలనే ఉద్దేశంతో తాను అమెరికాకు అధ్యక్షుడు కావాలని మస్క్ లోపల బలమైన కోరికను పెంచుకుంటున్నారు.

**• అగ్రరాజ్య చట్టసభల్లో పెరుగుతున్న భారతీయ మూలాలు**

అమెరికాలో ఒక భారతీయుడు ఎప్పటికైనా అధ్యక్షుడు అవుతాడని భారతీయులు చాలామంది ఎప్పటి నుంచో కలలు గంటున్నారు. ఎందుకంటే భారతీయ మూలాలు అమెరికా సమాజంలో అంతలా పాతుకుపోయాయి. గత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ విజయం సాధిస్తుందని.. అమెరికాలో భారతీయత వెల్లివిరుస్తుందని చాలా మంది భావించారు. కానీ అది జరగలేదు. కానీ అమెరికాలో ప్రస్తుతం ఏ పెద్ద టెక్నాలజీ సంస్థ నడవాలన్నా భారతీయులే దానికి ప్రధాన ఆధారంగా నిలబడ్డారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలకు భారతీయ సీఈఓలే దిక్సూచిగా మారారు. అంతేకాదు అమెరికాలో ఉన్న సంచలన ఆవిష్కరణలతోపాటు బడా కంపెనీల సీఈవోలు మనోళ్లే. అమెరికాలో భారతీయ జనాభా రోజురోజుకీ పెరగడం, అమెరికా చట్టసభల్లో కీలకమైన బాధ్యతల్లో భారతీయులు కొనసాగడం మనం నిరంతరం చూస్తూనే ఉన్నాం. కమలా హారిస్ లాంటి నాయకులు ఇప్పటికే వైస్ ప్రెసిడెంట్ స్థాయికి చేరడంతో భారతీయుల్లో ఈ నమ్మకం మరింత బలపడింది. అయితే కేవలం పదవులు మాత్రమే కాదు, నేరుగా దేశాన్నే శాసించే అధ్యక్ష పీఠంపై భారతీయులు ఎప్పుడు కూర్చుంటారా అని ప్రపంచం ఎదురుచూస్తోంది.

**• మారుతున్న రాజకీయం..**

**సామాన్యులలో పొంచి ఉన్న భయాలు**

నిజానికి ఒక కార్పొరేట్ వ్యక్తి అగ్రరాజ్యానికి అధ్యక్షుడు అయితే ఏం జరుగుతుందనే భయం కూడా సామాన్య మానవతావాదుల్లో వ్యక్తమవుతోంది. అసలే కార్పొరేట్ లక్షణాలను పునికి పుచ్చుకున్న అమెరికా పీఠంపైకి ఎలోన్ మస్క్ లాంటి లాభాపేక్ష కలిగిన వ్యాపారవేత్త వస్తే వ్యవస్థలు మరింత చిన్నభిన్నం అవుతాయేమోనని విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే డోనాల్డ్ ట్రంప్ తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల అమెరికా అంతర్గతంగా నలిగిపోతోందనే భావన ఒక వర్గంలో ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరోసారి మస్క్ లాంటి కఠినమైన కార్పొరేట్ బాస్ చేతికి అధికారం వస్తే సామాన్య ఉద్యోగుల మనుగడ కష్టమని భావిస్తున్నారు. అపారమైన సంపద, సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లపై పట్టు ఉన్న మస్క్ మాట్లాడే ప్రతి మాటను ప్రపంచం ఎంతో ఆసక్తిగా చూస్తోంది, కానీ ఆయన రాజకీయ ప్రవేశం ప్రజాస్వామ్యానికి ఎలాంటి ముప్పు తెస్తుందోనని కొందరు భయపడుతున్నారు.

**కార్పొరేట్ కబంధహస్తాల్లో అగ్రరాజ్యం.. ఏ దిశగా పోతుందో!**

అమెరికా రాజకీయాల్లో వ్యాపారవేత్తల పాత్ర రోజురోజుకూ పెరిగిపోతోంది. ఎలోన్ మస్క్ లాంటి అత్యంత ధనవంతుడు అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలని కలలు కనడం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ పరిణామాలను ఇక్కడ చర్చించాం. ట్రంప్‌తో ఉన్న సత్సంబంధాలు, గతంలో ఉద్యోగాల తొలగింపులో ఆయన పోషించిన పాత్ర ద్వారా ఆయన ఒక కఠినమైన పాలకుడిగా మారతారనే సంకేతాలు అందుతున్నాయి. అదే సమయంలో అమెరికాలో స్థిరపడిన కోట్లాది మంది భారతీయులు కూడా అగ్రరాజ్య చట్టసభల్లో ఎదుగుతూ, భవిష్యత్తులో ఒక భారతీయ మూలాలున్న వ్యక్తి అధ్యక్షుడు కావాలని ఆశిస్తున్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి ప్రపంచ అగ్రరాజ్యం వెళ్తే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందనే సరికొత్త విశ్లేషణాత్మక కోణాన్ని ఈ స్టోరీ స్పష్టం చేస్తోంది.

## పడిపోతున్న బర్త్ రేట్.. నెక్స్ట్ జనరేషన్ డౌట్

- పడిపోతున్న జననాల రేటు
- భారత జనాభాపై పెను మార్పులు
- ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ వ్యాపారవేత్త, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో చేసిన ఒక పోస్ట్ పెద్ద చర్చకు దారితీసింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు జనాభా భర్తీ స్థాయి కంటే తక్కువగా పడిపోయిందని చూపే గణాంకాలపై ఆయన స్పందించారు. విద్యావంతులైన భారతీయులలో జననాల రేటు చాలా ఏళ్ల క్రితమే ఈ స్థాయి కంటే కిందకు పడిపోయిందని మస్క్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై భారతీయ నిపుణులు, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తూ తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. పడిపోతున్న సంతానోత్పత్తి రేటు గణాంకాలు ప్రభుత్వ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రస్తుతం భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు ఒక మహిళకు 1.9 జననాలుగా నమోదైంది. స్థిరమైన జనాభాను నిర్వహించడానికి అవసరమైన కనీస స్థాయి 2.1 కంటే ఇది చాలా తక్కువ. ఒక దశాబ్దం క్రితం ఈ రేటు 2.3 గా ఉండేది. ఈ వేగవంతమైన మార్పు దేశంలో మారుతున్న జనాభా తీరును స్పష్టం చేస్తోంది. మస్క్ చేసిన ఈ పోస్ట్‌ను దాదాపు రెండు కోట్ల మందికి పైగా వీక్షించగా, పట్టణ జీవనశైలిలోని మార్పులపై తీవ్రమైన చర్చ నడుస్తోంది.

**• పిల్లల పెంపకానికి పెరుగుతున్న ఖర్చులు**

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ గాయత్రి శర్మ స్పందిస్తూ పడిపోతున్న జననాల రేటుకు పట్టణ జీవనశైలిని ప్రధాన కారణంగా పేర్కొన్నారు. నేటి కాలంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారని, దీనివల్ల వివాహాలు ఆలస్యంగా జరుగుతున్నాయని తెలిపారు. మొదటి సంతానం ఆలస్యం కావడం, కెరీర్ ఎదుగుదల సమయంలోనే రెండో సంతానానికి ప్లాన్ చేయాల్సి రావడం పెద్ద సవాలుగా మారింది. సొంత ఊర్లకు దూరంగా నగరాల్లో ఉండే దంపతులకు పిల్లలను చూసుకోవడానికి తల్లిదండ్రుల మద్దతు లభించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో చాలామంది ఒక్క పిల్లవాడితోనే ఆగిపోతున్నారు.

**• బాధ్యత కాదు సొంత నిర్ణయం**

ఆర్థిక రంగ నిపుణురాలు మాధవి జోషి ఈ మార్పును ఆర్థిక, సామాజిక కోణంలో విశ్లేషించారు. విద్యావంతులైన వారు పిల్లలను కనడం అనేది ఒక వ్యక్తిగత ఎంపికగా భావిస్తున్నారని, అదొక సామాజిక బాధ్యత లేదా తప్పనిసరి నిబంధన కాదని స్పష్టం చేశారు. పని ఒత్తిడి పెరగడం, జీవన వ్యయం ఆకాశాన్ని తాకడం, సమయం దొరకకపోవడం వంటి కారణాల వల్ల ప్రజలు తక్కువ మంది పిల్లలను కనడానికి మొగ్గు చూపుతున్నారు. నేటి తరం తల్లిదండ్రులు పిల్లల సంఖ్య కంటే వారి నాణ్యమైన పెంపకానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎందరో నెటిజన్లు సాధారణ ఆదాయం ఉన్నవారు ఒకే బిడ్డకు ప్రాథమిక అవసరాలు తీర్చడమే కష్టంగా మారిందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**• నగరాల్లో తీవ్ర రూపం దాల్చిన సంక్షోభం**

సంతానోత్పత్తి రేటు క్షీణత పట్టణ ప్రాంతాల్లో, చదువుకున్న జనాభాలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీ వంటి నగరాల్లో ఈ రేటు కేవలం 1.2 గా నమోదైంది, ఇది దేశంలోనే అత్యంత తక్కువ స్థాయిలలో ఒకటి. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, మహిళలు పెద్ద సంఖ్యలో ఉద్యోగాల్లో చేరడం, ఖరీదైన జీవన పరిస్థితులు ఇందుకు కారణాలుగా మారాయి. ప్రస్తుతం భారత్ 146 కోట్లకు పైగా జనాభాతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, భవిష్యత్తులో జనాభా వృద్ధి నెమ్మదించి వృద్ధుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని జనాభా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**దేశ భవిష్యత్తును మార్చే జనాభా సంక్షోభం**

భారతదేశంలో జననాల రేటు తగ్గడం అనేది కేవలం ఒక సంఖ్యకు సంబంధించిన విషయం కాదు, అది మారుతున్న సామాజిక సంకెళ్లకు నిదర్శనం. ఒకవైపు ఆర్థిక భద్రత, మెరుగైన భవిష్యత్తు కోసం సామాన్యుడు తక్కువ మంది పిల్లలను కనడానికి మొగ్గు చూపుతుండగా, మరోవైపు ఇది భవిష్యత్తులో దేశ శ్రామిక శక్తిపై చూపే ప్రభావం ఆందోళన కలిగిస్తోంది. కేవలం పిల్లలను కనమని జనాభాకు పిలుపునివ్వడం కంటే, విద్యావంతులైన దంపతులకు తగిన సహాయక వ్యవస్థలు, సరసమైన ధరల్లో విద్య, వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యత. ఆర్థిక భారం తగ్గి, పిల్లల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడినప్పుడే ఈ జనాభా సమతుల్యత సంక్షోభం నుండి దేశం బయటపడగలదు.



## కోడింగ్ చాప్టర్ క్లోజ్.. ఏఐతో కొత్త ఫేజ్




- ఐటీ రంగానికి షాక్: కోడింగ్ డెడ్!
- ఈ ఏడాది చివరికల్లా కోడింగ్ ఖతం
- ఆ ఉద్యోగాల కాలం చెల్లిపోయిందా?
- ఎలోన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు

టెక్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించే సాఫ్ట్‌వేర్ కోడింగ్ ఉద్యోగం త్వరలోనే అంతరించిపోనుందా? అంటే అవుననే అంటున్నారు ప్రముఖ టెక్ దిగ్గజం ఎలోన్ మస్క్. టెస్లా, ఎక్స్ఏఐ అధినేత అయిన మస్క్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంపై ఎప్పుడూ సంచలన వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తారు. ఇటీవల జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది చివరి నాటికి సాంప్రదాయ కోడింగ్ విధానం పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. భవిష్యత్తులో మానవులు కూర్చుని కోడింగ్ రాయాల్సిన అవసరం అస్సలు ఉండదని, ఆ స్థానాన్ని పూర్తిగా ఏఐ సాంకేతికత భర్తీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. మస్క్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో, ఐటీ నిపుణులలో పెద్ద కలకలాన్ని రేపుతున్నాయి.

**• కంపైలర్ల అవసరం లేదు: నేరుగా బైనరీ ఫైల్స్ సృష్టించనున్న ఏఐ**

సాధారణంగా సాఫ్ట్‌వేర్ డెవలపర్లు కోడ్ రాసిన తర్వాత, దానిని కంప్యూటర్‌కు అర్థమయ్యేలా మార్చడానికి 'కంపైలర్' అనే ప్రోగ్రామ్ అవసరమవుతుంది. అయితే ఇకపై ఈ మధ్యంతర ప్రక్రియలన్నీ వేస్ట్ అని మస్క్ అభిప్రాయపడ్డారు. మనకు ఎలాంటి అవుట్‌పుట్ కావాలో ఏఐకి చెబితే చాలు, అది నేరుగా అత్యంత సమర్థవంతమైన 'ఆప్టిమైజ్డ్ బైనరీ' ఫైల్‌ను సృష్టించి ఇస్తుందని ఆయన వివరించారు. మనుషులు రాసే కోడింగ్ కంటే, కంపైలర్ల కంటే కూడా ఏఐ రూపొందించే బైనరీ కోడ్ చాలా వేగంగా, తక్కువ లోపాలతో పనిచేస్తుందని మస్క్ పేర్కొన్నారు. అందువల్ల మధ్యలో ఉండే సాంప్రదాయ కోడింగ్ అనే దశను టెక్నాలజీ పూర్తిగా దాటవేస్తుందని, ఈ విప్లవాత్మక మార్పు ఈ ఏడాది... 2026 ఆఖరి నాటికే సాధ్యం కావచ్చునని ఆయన బలంగా నమ్ముతున్నారు.

**• గ్రౌండ్ రియాలిటీ: ఇప్పటికే తగ్గిపోయిన ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలు**

ఎలోన్ మస్క్ వ్యాఖ్యలు కేవలం ఊహాగానాలు మాత్రమే కావని, ప్రస్తుతం మార్కెట్లో జరుగుతున్న పరిణామాలు కూడా దీనిని నిజం చేస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఓపెన్ ఏఐ కి చెందిన 'కోడెక్స్', ఆంత్రోపిక్ సంస్థకు చెందిన 'క్లాడ్ కోడ్' వంటి సరికొత్త ఏఐ టూల్స్ రంగంలోకి వచ్చాక పరిస్థితులు వేగంగా మారిపోయాయి. ఇవి కేవలం ఒక లైన్ కోడ్ సూచించడమే కాకుండా, మొత్తం సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్‌ను పరిశీలించి, టెస్టింగ్‌లు నిర్వహించి, లోపాలను స్వయంగా సరిచేస్తున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, రెవెలియో ల్యాబ్స్ సంయుక్తంగా విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం, మార్కెట్లో ఎంట్రీ లెవెల్ ఐటీ ఉద్యోగాల ప్రకటనలు ఏకంగా 35 శాతం పడిపోయాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ప్రోగ్రామింగ్ రంగాలు దీనివల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి.

**• నిరుద్యోగ భయాలు: నిపుణుల హెచ్చరికలు, మారిన మాటలు**

ఏఐ టెక్నాలజీ వల్ల ఉద్యోగాల కోతపై గతంలో ఆంత్రోపిక్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ డారియో అమోడెయ్ కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ కారణంగా ఆఫీసుల్లో పనిచేసే దాదాపు సగం మంది ఎంట్రీ లెవెల్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, దీనివల్ల నిరుద్యోగిత రేటు 10 నుండి 20 శాతానికి పెరగొచ్చని ఆయన గత ఏడాది హెచ్చరించారు. ఏఐ అభివృద్ధిని కొంతకాలం ఆపాలని కూడా ఆయన కోరారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన సంస్థ స్టాక్ మార్కెట్ ఐపీఓకి సిద్ధమవుతున్న వేళ.. ఆయన తన స్వరాన్ని కాస్త మార్చారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పూర్తిగా పోవని, మనుషులు చేసే పని పరిధి మరింత విస్తరిస్తుందని సరికొత్త వాదనను తెరపైకి తెచ్చారు. ఏదేమైనా కోడింగ్ రంగంలో ఊహించని మార్పులు మాత్రం ఖాయంగా కనిపిస్తున్నాయి.




# దుమ్మురేపిన ఇంగ్లండ్

- » 4-0తో సిరీస్ వైట్ వాష్
- » చివరి వన్డేలోనూ ఓటమి
- » పరిజాయం పరిపూర్ణం
- » ప్రపంచ నంబర్‌వన్ స్థానం

భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. చివరి మ్యాచ్‌లో 56 పరుగుల తేడాతో విజయం సాధించిన ఇంగ్లండ్ సిరీస్‌ను 40తో కైవసం చేసుకుంది. ఈ విజయంతో టీ20 అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ సిరీస్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలవగా, చివరి మ్యాచ్‌లో జోస్ బట్లర్ విధ్వంసకర సెంచరీతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

**• బట్లర్, బ్రూక్ విధ్వంసం**

చివరి మ్యాచ్‌లో బట్లర్, బ్రూక్ అద్భుత భాగస్వామ్యంతో భారత్‌పై భారీ స్కోరు నమోదు చేశారు. మ్యాచ్ అనంతరం హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ తాము సరైన బంతిని సరైన షాట్‌తో ఆడటంపైనే దృష్టి పెట్టామని చెప్పాడు. ఆటను క్లిష్టంగా కాకుండా సులభంగా ఆడటమే తమ విజయ రహస్యమని తెలిపాడు. గత ఏడాది కాలంగా జట్టు మధ్య సమన్వయం అద్భుతంగా పెరిగిందని, స్పిన్నర్లు కూడా ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి తీసుకొచ్చారని వివరించాడు.

**టీమిండియా తప్పిదాలు: శ్రేయస్**

భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సిరీస్‌లో నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయని అంగీకరించాడు. విదేశీ పరిస్థితులకు అనుగుణంగా వేగంగా అలవాటు పడాల్సిన అవసరం ఉందని చెప్పాడు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో చేసిన తప్పిదాలు భారీ మూల్యం చెల్లించాయని పేర్కొన్నాడు. కీలక క్యాచ్‌లు వదలడం వల్లే ఇంగ్లండ్ 220 పరుగులకే పరిమితమయ్యే అవకాశం చేజారిందని వివరించాడు. ఛేదనలో భాగస్వామ్యాలు నిర్మించకుండా వేగంగా పరుగులు చేయాలనే ఆతృత వికెట్లు కోల్పోయేలా చేసిందని అన్నాడు.

**• బట్లర్ ఆనందం**

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జోస్ బట్లర్ తన ఫామ్ తిరిగి రావడం ఆనందంగా ఉందని తెలిపాడు. ఇంగ్లండ్ జెర్సీ ధరించినప్పుడల్లా తనలో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తుందని చెప్పాడు. హ్యారీ బ్రూక్ బౌలర్లపై నిరంతరం ఒత్తిడి పెంచాడని ప్రశంసించాడు. భారత్‌పై 40తో సిరీస్ గెలవడం గొప్ప విజయమని, జట్టులోని ప్రతి ఆటగాడు తన వంతు పాత్ర పోషించడమే ఈ ఫలితానికి కారణమని పేర్కొన్నాడు.

**• టీమిండియాకు హెచ్చరిక**

ఈ సిరీస్ భారత జట్టుకు అనేక లోపాలను స్పష్టంగా చూపించింది. బ్యాటింగ్‌లో నిలకడ లేకపోవడం, ఫీల్డింగ్‌లో నిర్లక్ష్యం, బౌలింగ్‌లో ప్రణాళికల అమలులో వైఫల్యం జట్టును తీవ్రంగా దెబ్బతీశాయి. మరోవైపు ఇంగ్లండ్ అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించి ప్రపంచ నంబర్‌వన్ జట్టుగా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంది. ఈ పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుని రాబోయే సిరీస్‌ల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సిన అవసరం ఇప్పుడు టీమిండియాపై స్పష్టంగా కనిపిస్తోంది.

# వైభవ్‌కు షాక్..

## తుది మ్యాచ్‌లో జట్టుకు దూరం



ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టీ20కు ముందు భారత జట్టు అనూహ్య నిర్ణయం తీసుకుంది. యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని తుది జట్టులో నుంచి తప్పించి, అతని స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇచ్చింది. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 14, 13, 15 పరుగులు మాత్రమే చేసిన వైభవ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు. జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఏ కూర్పు సరిపోతుందో తెలుసుకోవాల్సిన సమయం ఇదేనని, అందుకే ఈ మార్పు చేశామని వివరించాడు. అయితే ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన పరిస్థితిలో యువ ఆటగాడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాల్సిందని పలువురు మాజీ క్రికెటర్లు అభిప్రాయపడ్డారు. సునీల్ గవాస్కర్, నాసర్ హుస్సేన్, రవిశాస్త్రి కూడా వైభవ్‌ను తప్పించడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. మరోవైపు జింబాబ్వేతో జరిగే తదుపరి టీ20 సిరీస్‌కు వైభవ్ ఎంపిక కాగా, సంజూ శాంసన్ జట్టులో లేకపోవడం కూడా ఈ నిర్ణయంపై మరింత చర్చకు దారితీసింది.

# వైభవ్‌ను తప్పించడం తప్పు

**మరో అవకాశం ఇవ్వాలన్న గవాస్కర్**



భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని కేవలం మూడు మ్యాచ్‌ల తర్వాత జట్టు నుంచి తప్పించడంపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లండ్‌తో ఐదో టీ20లో వైభవ్ స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వడాన్ని ఆయన ప్రశ్నించారు. వైభవ్ మైదానంలో నడుచుకుంటూ వచ్చిన తీరు చూస్తే ఎంత నిరాశకు గురయ్యాడో అర్థమవుతుందని అన్నారు. మరో మ్యాచ్‌లో అవకాశం ఇచ్చి అతను తన తప్పుల నుంచి ఏం నేర్చుకున్నాడో చూడాల్సిందని అభిప్రాయపడ్డారు. మూడు ఇన్నింగ్స్‌ల్లో పెద్ద స్కోర్లు చేయకపోయినా వైభవ్‌లో అసాధారణ ప్రతిభ కనిపించిందని గవాస్కర్ పేర్కొన్నారు. అతడు కొట్టిన సిక్సర్లు అతని సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు. ఈ మ్యాచ్ సిరీస్ ఫలితాన్ని మార్చే పోరు కాకపోవడంతో యువ ఆటగాడిని కొనసాగించి ఉంటే బాగుండేదన్నారు. 15 ఏళ్ల వయసులోనే జట్టు నుంచి తప్పించడం కఠిన నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ మార్పు చేశామని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశారు. మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ కూడా సంజూ శాంసన్ ఎంపికపై సందేహాలు వ్యక్తం చేశారు.



# కన్నీళ్ల నుంచి వింబుల్డన్ కిరీటం వరకు

**• లిండా నోస్కోవా అద్భుత పోరాటం**

వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో చెక్ యువ సంచలనం లిండా నోస్కోవా అద్భుత విజయంతో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్లో తోటి చెక్ క్రీడాకారిణి కరోలినా ముచోవాపై 62, 57, 63 తేడాతో విజయం సాధించింది. తొలి సెట్‌ను సునాయాసంగా గెలిచిన నోస్కోవా, రెండో సెట్‌లో వరుసగా ఐదు మ్యాచ్ పాయింట్లను వృథా చేసుకోవడంతో తీవ్ర భావోద్వేగానికి గురై కోర్టులోనే కన్నీళ్లు పెట్టుకుంది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ముచోవా రెండో సెట్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. రెండు గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ పోరు వింబుల్డన్ చరిత్రలో అత్యంత ఉత్కంఠభరితమైన ఫైనల్లలో ఒకటిగా నిలిచింది. అయితే నిరాశకు లొంగకుండా అద్భుత మానసిక ధైర్యాన్ని ప్రదర్శించిన 21 ఏళ్ల చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి నోస్కోవా మూడో సెట్‌లో మళ్లీ తన ఆటను అందుకుని ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. చివరకు నిర్ణయాత్మక సెట్‌ను 63తో గెలిచి కెరీర్‌లో తొలి వింబుల్డన్, తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకుంది. ఈ విజయంతో గత 15 ఏళ్లలో వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిలిచింది. తన చిన్ననాటి ఆదర్శం క్విటోవా సాధించిన ఘనతను పునరావృతం చేస్తూ చెక్ టెన్నిస్‌కు మరో గర్వకారణంగా అవతరించింది. రాయల్ బాక్స్‌లో కూర్చొని తన శిష్యురాలి విజయాన్ని క్విటోవా వీక్షించడం ఈ చారిత్రక విజయానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.



# అస్తమించిన గాన కోకిల

**మూగబోయిన మధుర గానం**

**సంగీత ప్రపంచానికి దిక్సూచి**

దక్షిణ భారత సినీ సంగీతానికి చిరునామాగా నిలిచిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి కన్నుమూశారు. 88 ఏళ్ల వయసులో శనివారం మైసూరులో ఆమె తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆమె మనవరాలు అప్సరా వైద్యులా కుటుంబ సభ్యుల తరఫున వెల్లడించారు. కుటుంబ సభ్యుల ప్రేమ మధ్య ప్రశాంతంగా ఆమె కన్నుమూశారని పేర్కొన్నారు. కోట్లాది మంది అభిమానులను తన మధుర గానంతో అలరించిన ఎస్. జానకి మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటుగా మారింది. ఆమె గాత్రం ఎన్నో తరాల భావోద్వేగాలకు చిరస్థాయి గుర్తుగా నిలిచిపోయింది.

**సంగీత ప్రపంచం ఒక్కసారిగా మూగబోయింది. నిశ్శబ్దం ఆవరించింది. ఎన్నో తరాల భావోద్వేగాలకు ఊపిరిగా నిలిచిన ఆ మధుర స్వరం ఇక కొత్త పాటను పలకదు. వెండితెరపై వినిపించిన ప్రతి రాగం, ప్రతి పల్లవి, ప్రతి ఆలాపన ఇప్పుడు జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోయాయి. దక్షిణ భారత సినీ సంగీతానికి చిరునామాగా నిలిచిన గాన కోకిల ఎస్. జానకి తన చివరి నిశ్వాసతో ఒక స్వర్ణయుగానికి తెరదించారు. ఆమె వెళ్లిపోయినా, లక్షలాది హృదయాల్లో మిగిలిన స్వరం మాత్రం ఎన్నటికీ అస్తమించదు. ఆనందానికి చిరునవ్వు, విషాదానికి కన్నీరు, ప్రేమకు పరవశం, భక్తికి పరిమళం ఇచ్చిన ఆ గాత్రం ఇప్పుడు సంగీత సరస్వతిలో లీనమైంది. గాయని మాత్రమే కాదు... ఒక యుగం ముగిసింది. కానీ ఆమె పాడిన ప్రతి పాట, ప్రతి స్వరం, ప్రతి భావం భారతీయ సంగీత చరిత్రలో శాశ్వతంగా మార్మోగుతూనే ఉంటుంది.**



### ఆంధ్ర నేలలో పుట్టిన గాన కోకిల

ఎస్. జానకి 1938 ఏప్రిల్ 23న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి సిస్ల శ్రీరామమూర్తి ఆయుర్వేద వైద్యుడు. ఉపాధ్యాయుడిగానూ సేవలందించారు. చిన్ననాటి ఎక్కువ కాలం సిరిసిల్లలో గడిచింది. కేవలం తొమ్మిదేళ్ల వయసులోనే వేదికపై తొలి గాన ప్రదర్శన ఇచ్చారు. నాదస్వర విద్వాంసుడు పైడిస్వామి వద్ద సంగీతానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు నేర్చుకున్నారు. శాస్త్రీయ సంగీతంలో అధికారిక శిక్షణ లేకపోయినా, తన సహజ ప్రతిభతో భారత సంగీత చరిత్రలో అరుదైన స్థానం సంపాదించారు.

### ఆరు దశాబ్దాల అపూర్వ గాన ప్రస్థానం

పదొమ్మిదేళ్ల వయసులోనే విధియిన్ విలయట్టు తమిళ చిత్రం ద్వారా నేపథ్య గాయనిగా ప్రయాణం ప్రారంభించారు. తొలి ఏడాదిలోనే ఆరు భాషల్లో పాటలు పాడి తన ప్రతిభను నిరూపించారు. ఆ తర్వాత ఆరు దశాబ్దాలకు పైగా వేలాది పాటలతో సంగీత ప్రపంచాన్ని అలరించారు. 2016లో సినీ గానానికి వీడ్కోలు ప్రకటించిన ఆమె, 2018లో పన్నాడి చిత్రం కోసం మరోసారి స్వరం అందించి అభిమానులను ఆనందపరిచారు. సుమారు 20 వేలకుపైగా పాటలను పలు భారతీయ భాషల్లో ఆలపించి అత్యంత ఎక్కువ పాటలు పాడిన గాయనుల్లో ఒకరిగా నిలిచారు.

### పురస్కారాల సినీ ప్రస్థానం

ఎస్. జానకి నాలుగు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకున్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 33 చలనచిత్ర పురస్కారాలు అందుకుని అరుదైన ఘనత సాధించారు. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆమె తిరస్కరించారు. భారత సంగీతానికి చేసిన తన సేవలకు తగిన గుర్తింపుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వాలని ఆమె అభిప్రాయపడ్డారు. కళాకారిణిగా మాత్రమే కాదు, తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకున్న వ్యక్తిగా కూడా ఆమె గుర్తింపు పొందారు.

### కుటుంబానికి ప్రేమ.. అభిమానులకు ప్రేరణ

1959లో వి. రాంప్రసాద్‌ను వివాహం చేసుకున్న ఎస్. జానకి గాన ప్రయాణంలో ఆయన కీలకంగా నిలిచారు. రికార్డింగ్‌లకు ఆమెతో పాటు వెళ్లి పూర్తి సహకారం అందించేవారు. 1997లో ఆయన గుండెపోటుతో మరణించారు. కుటుంబ సభ్యుల ప్రేమను, అభిమానుల ఆదరణను సమానంగా గౌరవించిన జానకి జీవితమంతా నిరాడంబరంగా సాగింది. ప్రపంచానికి ఆమె గొప్ప గాయని అయితే, కుటుంబానికి ప్రేమతో నింపిన అమ్మమ్మగా చిరస్మరణీయమని ఆమె మనవరాలు భావోద్వేగంగా గుర్తుచేశారు.

### ఎప్పటికీ నిలిచే అమర స్వరం

తెలుగు మాతృభాష అయినప్పటికీ తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లోనూ ఆమెకు అద్భుత పట్టు ఉండేది. ప్రతి భాషలో భావాన్ని సహజంగా పలికించిన గాత్రమే ఆమెను కోట్లాది మంది హృదయాల్లో నిలిపింది. ఎస్. జానకి ఇక మన మధ్య లేకపోయినా, ఆమె ఆలపించిన ప్రతి పాట సంగీత ప్రేమికుల హృదయాల్లో చిరకాలం మార్మోగుతూనే ఉంటుంది. ఒక గాయని వెళ్లిపోయినా, ఆమె స్వరం మాత్రం భారతీయ సంగీత చరిత్రలో శాశ్వతంగా జీవిస్తుంది.

### సుస్వర మధురవాణి...

**సుగంధ పరిమళాల గాయని...**

**ఎస్. జానకి స్మృతిలో..**

**గొంతు కాదు అది...**
**గుండెలో మొలిచిన గానవృక్షం!**
**పాట కాదు అది—**
**ప్రజల ఊపిరిలో పరిమళించిన**
**జీవనరాగం!**

**కాలం ఒక శరీరాన్ని ఆపగలదేమో...**
**కానీ.. ఒక స్వరాన్ని ఎప్పటికీ మౌనం చేయలేదు.**

**జానకమ్మ..**
**మీరు లేరు అనడం అబద్ధం—**
**ప్రతి ఇంటి రేడియోలో,**
**ప్రతి ఇంటి టీవీలో..**
**ప్రతి తల్లి జోలపాటలో,**
**ప్రతి ప్రేమ గీతంలో,**
**ప్రతి కన్నీటి చుక్కలో...**
**మీరింకా పాడుతూనే ఉన్నారు.**

**స్వరం మరణించదు...**
**మనసులు ఉన్నంతకాలం**
**జానకమ్మ అనే గానం**
**జీవిస్తూనే ఉంటుంది.**

**– హుస్సేన్..**

మరలి రాని లోకాలకు

# మరపు రాని స్వరం..

**• దివికేగిన గాన కోకిల • ఎస్ జానకి కన్నుమూత**

**క్లాసికల్ సంగీతమైనా.. క్యాబరే సాంగైనా.. పసిపిల్ల గొంతు నుంచి పండు ముసలమ్మ వరకు ఎవరి గొంతుకకైనా సరిపడే ఏకైక ప్లే బ్యాక్ వాయిస్ ఎస్. జానకిదే అనడంలో సందేహం లేదు...**
**సినీ సంగీత వినీలాకాశంలో ఎస్. జానకి ఓ ధ్రువతార. కాలం మారినా, తరాలు మారినా ఆమె గాత్ర మాధుర్యం మాత్రం ఎన్నడూ వెలుగు కోల్పోలేదు. ప్రతి పాటలో భావానికి ప్రాణం పోసిన ఆమె స్వరం కోట్లాది సంగీతాభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంది. ప్రేమకు మాధుర్యం, భక్తికి పవిత్రత, విషాదానికి ఆవేదన, ఆనందానికి ఉత్సాహం అందించిన గాన కోకిలగా ఆమె నిలిచారు.**
**దక్షిణ భారత సినీ సంగీతాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన అపూర్వ గాత్రం ఇక వినిపించదనే వార్త సంగీత ప్రపంచాన్ని శోకసంద్రంలో ముంచేసింది. ఆమె భౌతికంగా దూరమైనా, ప్రతి ఇంట్లో వినిపించే పాటల్లో, ప్రతి సంగీతాభిమాని హృదయంలో, ప్రతి జ్ఞాపకంలో ఆమె స్వరం చిరకాలం సజీవంగానే నిలిచిపోతుంది.**
**ఎస్. జానకి అస్తమయం ఒక మహాగాన యుగానికి ముగింపు అయినా, ఆమె గాన వారసత్వం మాత్రం శాశ్వతంగా వెలుగొందే ధ్రువతారగానే నిలుస్తుంది.**
**దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచాన్ని తన అపూర్వ గానంతో ఎన్నో దశాబ్దాల పాటు అలరించిన ప్రముఖ గాయని ఎస్. జానకి ఇక లేరు. శనివారం మైసూరులో ఆమె కన్నుమూశారు. ఈ వార్త సంగీత అభిమానులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.**
**ఎన్నో తరాల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆమె స్వరం ఇప్పుడు జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోయింది. పాటలో భావాన్ని ప్రాణం పోసే అరుదైన గాత్రంగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రేమ, భక్తి, విషాదం, ఉత్సాహం, జానపదం, హాస్యం... ఏ భావమైనా ఆమె గొంతులో కొత్త జీవం పొందేది.**

**• అపూర్వ గాత్రంతో చిరస్థాయి స్థానం**

ఎస్. జానకి తన గాన ప్రయాణాన్ని ప్రారంభించిన సమయంలో ప్రముఖ గాయని పి. సుశీల సినీ సంగీత రంగాన్ని ఏలుతున్నారు. అలాంటి పోటీ మధ్య కూడా జానకి తన ప్రత్యేక శైలితో అగ్రగాయనిగా ఎదిగారు. కె.వి. మహదేవన్, ఎం.ఎస్. విశ్వనాథన్ వంటి ప్రముఖ సంగీత దర్శకులతో కలిసి ఎన్నో అద్భుత గీతాలను ఆలపించారు. తర్వాత ఇళయరాజాతో ఏర్పడిన సంగీత ప్రయాణం ఆమె కెరీర్‌కు మరింత గొప్ప గుర్తింపును తీసుకొచ్చింది. అన్నకిళి సినిమా నుంచి ప్రారంభమైన ఈ కలయిక ఎన్నో చిరస్మరణీయ గీతాలకు జన్మనిచ్చింది.

**• జాతీయ పురస్కారంతో మరింత గౌరవం**

దర్శకుడు భారతీరాజా తొలి చిత్రం 16 వయతినిలేలోని "సెంతోరా పూవే" పాటకు ఎస్. జానకి ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్నారు. ఆ పాట ఆమె గాత్రంలోని మాధుర్యాన్ని ప్రపంచానికి మరోసారి పరిచయం చేసింది. ఇటీవలే భారతీరాజా మరణించగా, ఇప్పుడు జానకి కూడా కన్నుమూయడం సినీ ప్రపంచాన్ని మరింత విషాదంలోకి నెట్టింది.

**• శాస్త్రీయ సంగీతానికి సినీ అందం**

కొంజుమ్ సలంగై చిత్రంలోని "సింగార వేళనే దేవా" పాట ఎస్. జానకి గాన జీవితంలో ఓ మైలురాయి. అభేరి రాగంలో స్వరపరిచిన ఈ గీతం కర్ణాటక సంగీతాన్ని సినీ సంగీతంతో అద్భుతంగా మేళవించింది. అలాగే కుంకుమం చిత్రంలోని "చిన్నంచిరియా వన్నపరవై" పాటలో దర్బారి కనడ రాగంలోని అందాలను ఆమె గాత్రం అద్భుతంగా ఆవిష్కరించింది. ప్రతి స్వరంలోనూ భావాన్ని పలికించే ఆమె సామర్థ్యం సంగీత ప్రేమికులను ఇప్పటికీ ఆకట్టుకుంటూనే ఉంది.

**• భాషలు దాటిన గాన మాధుర్యం**

ఎస్. జానకి కేవలం తమిళంలోనే కాదు. తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ సహా మొత్తం 18 భాషల్లో వేలాది పాటలు పాడారు. చిన్నారి గొంతును సైతం సహజంగా అనుకరించే అరుదైన ప్రతిభ ఆమె సొంతం. కర్ణాటక సంగీతంలో శిక్షణ పొందిన ఆమె త్యాగరాజ కీర్తనలను కూడా ఆలపించి ప్రత్యేక ఆల్బమ్ విడుదల చేశారు. శాస్త్రీయ సంగీతాన్ని సామాన్య శ్రోతకు చేరువ చేయడంలో ఆమె పాత్ర విశేషం.
ఎప్పటికీ చెరగని గాన వారసత్వం
సినీ సంగీత చరిత్రలో ఎస్. జానకి పేరు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆమె పాడిన వేలాది పాటలు కాలాన్ని దాటి తరతరాలకు వినిపిస్తూనే ఉంటాయి. గాయని మాత్రమే కాదు... భావాలను స్వరంగా మలిచిన సంగీత సరస్వతిగా ఆమెను అభిమానులు గుర్తుంచుకుంటారు. ఆమె భౌతికంగా దూరమైనా, ఆమె స్వరం ప్రతి సంగీతాభిమాని హృదయంలో శాశ్వతంగా మార్మోగుతూనే ఉంటుంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085